సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
సంపుటి 18 | సంచిక 201
బుధవారం | 14 మే 2025 | విజయవాడ
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




☞ APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర బహుళ విదియ రా.12.27, అనూరాధ ఉ.10.23 వర్జ్యం సా.4.23 నుంచి 6.11 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.30 నుంచి 12.21 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



5 లో

● ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గు చూపిన ఇన్వెస్టర్లు ● 1,281 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ ● 346 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

## ఇండోనేషియాలో భారీ పేలుడు



6 లో

● 13 మంది మృతి ● నలుగురు సైనికులు, తొమ్మిది మంది నివాసితులు మృతి

ఇండోనేషియాలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 13 మంది దుర్మరణం చెందారు. సైన్యానికి సంబంధించిన కాలం చెల్లిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేస్తుండగా ఒక్కసారిగా ఈ పేలుడు సంభవించింది.

## మా సైనికులు చనిపోయింది 11 మందే

● మృతుల్లో ఆరుగురు ఆర్మీకి చెందిన వారు ● ఐదుగురు వైమానికి దళానికి చెందిన వారని వెల్లడి ● మరో 78 మంది గాయపడినట్లు ప్రకటించిన పాక్



6 లో

# ఉగ్రవాదం అంతు చూస్తాం

## సిందూరం తుడిచినవాని నట్టింటికి వెళ్లి నాశనం చేశాం

● టెర్రరిస్టుల పీచమణచడమే భారత సైన్యం శపథం ● త్రివిధ దళాల మధ్య సమన్వయం అద్భుతం ● భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుంది ● దాడి చేయాలని చూస్తే శత్రువును తుదముట్టిస్తాం● వాయుసేనను ఎందుకు కలవాల్సి వచ్చిందో వివరించిన మోడీ ● ఎయిర్బేస్‌లో ప్రధాని మోడీ పర్యటన



6 లో

## ఆపరేషన్ సిందూర్

● 70 దేశాల దౌత్యాధికారులకు బ్రీఫింగ్ ● రక్షణ నిఘా సంస్థ డీజీ లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా వివరణ



6 లో

## సీబీఎస్సీ పదో తరగతి ఫలితాలు విడుదల



6 లో

దేశవ్యాప్తంగా 42 లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న సీబీఎస్సీ10, 12 తరగతుల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి.

## లోతైన అధ్యయనం

# ఆదాయం పెరుగుదల

● 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయండి
● ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం
● సాంకేతికత వినియోగంతో పన్ను ఎగవేతలకు చెక్
● అంతర్జాతీయంగా ఎర్రచందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు
● ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



2 లో

రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం

# మెండుగా ఉండాలి

● మంత్రి నేతృత్వంలో బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో పూజలు ● జాతీయతను పెంపొందించే విషయంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ముందు ఉంటుంది ● ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి ఆపదలను దూరం చేసింది ● మంత్రి కందుల దుర్గేష్



2 లో

పాకిస్థాన్ కు గట్టి గుణపాఠం చెప్పిన దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలనుసారం జనసేన తరపున పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, వీర మహిళలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లో షష్ట షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## లిక్కర్ కేసులో అరెస్టుకు బ్రేక్



2 లో

● ఈ అవకాశం నెల రోజులే ● ఎంపీ మిథున్ మళ్లీ హైకోర్టులోనే తేల్చుకోవాలి

వైసీపీ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అప్పటికే మద్యం కేసులో మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చకపోవడం, అరెస్ట్ చేసే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన క్రమంలో ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

## మురళీ నాయక్ తల్లిదండ్రులకు

# మాజీ సీఎం జగన్ పరామర్శ

● మురళీ నాయక్ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉంటుందన్న జగన్ ● వైసీపీ తరపున వీర జవాన్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఇస్తానని వెల్లడి ● నాయక్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్న వైసీపీ అధినేత



2 లో

## అండమాన్‌కు నైరుతి

# రుతుపవనాలు



6 లో

● వేసవి నుంచి ఉపశమనం ● వేగంగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు ● దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల వద్ద విస్తరించిన రుతుపవనాలు ● మే 27 నాటికి కేరళను తాకే అవకాశం

## అంతా ఇంతే!




స్వాగతం సరే
సహకరించాలి కదా సార్

## వంశీకి బెయిల్



3 లో

● సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టైన వైసీపీ నేత ● రేపటి వరకు వంశీ రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు ఉత్తర్వులు ● వంశీతో సహా మిగిలిన నలుగురు నిందితుల రిమాండ్ కూడా పొడిగింపు

## రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు

# సిద్ధంగా ఉన్నాయి

● ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించండి ● వేగవంతంగా యూనిట్ల స్థాపనకు యంత్రాంగం చర్యలు చేపట్టాలి ● ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలే ప్రభుత్వ లక్ష్యం ● నెలాఖరుకు మన మిత్ర ద్వారా అందుబాటులోకి 400 రకాల సేవలు ● ఎలక్ట్రానిక్స్, ఆర్‌టిజిఎస్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష

రాష్ట్రంలో కొత్తగా తమ సంస్థలను ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేష్ సమీక్షించారు.



2 లో

## సొంతూరులో

# పరిశ్రమలు పెట్టండి

● రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజ ● ఎంఎస్‌ఎంఈ పార్కులతో ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్త ● జగన్ హయాంలో పారిశ్రామికంగా కుంటుపడిన ఏపీ : మంత్రి సవిత



2 లో

ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి.. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. మన యువతకు ఉద్యోగిలిచ్చి... రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించండి అని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామి కవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు.




## ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కలిసికట్టుగా కృషి చేయాలి - రైతు సాధికార సంస్థ సీఈవో

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. రామారావు స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరు లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం ఆరంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా రైతు సేవ కేంద్రాలలో పనిచేసే వి ఏ ఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లు), వి హెచ్ ఏ (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ లు) లకు ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో శిక్షకులను తయారు చేయడం కోసం ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ కు చెందిన అధికారులు, రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి శిక్షణ ముగిసిన అనంతరం ఇక్కడ శిక్షణ పొందిన శిక్షకులు జిల్లాలలో డివిజన్ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి రైతు సేవ కేంద్రంలో పని చేసే సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమ ప్రారంభోపన్యాసంలో సీఈఓ రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11.60 లక్షల మంది రైతులు 13 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానాలు అనుసరిస్తున్నారని, నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ గా గుర్తించ బడ్డ రైతు సాధికార సంస్థ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినదని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుల సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం, నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకొన్న అంశాలను గ్రామ స్థాయి వరకు చిత్త శుద్ధితో తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభంలో ఉందనే విషయం అందరికీ తెలుసునని, ప్రకృతి వ్యవసాయంను ప్రత్యామ్నాయంగా రైతులందరి చెంతకు తీసుకువెళ్ళి రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించాలని అన్నారు.

# లోతైన అధ్యయనం ఆదాయం పెరుగుదల

- 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం
- సాంకేతికత వినియోగంతో పన్ను ఎగవేతలకు చెక్
- అంతర్జాతీయంగా ఎర్రచందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు
- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి, మే 13 : రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతి శాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**సరఫరా, అమ్మకాల ట్రాకింగ్ :**

పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంభించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం :**

రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి...వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం**

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ.17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం :** రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ.33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చు కోవాలి :** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని...మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్ర బాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.... మంచి పనితీరు ద్వారా ఆయా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని....ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

- ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించండి
- వేగవంతంగా యూనిట్ల స్థాపనకు యంత్రాంగం చర్యలు చేపట్టాలి
- ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలే ప్రభుత్వ లక్ష్యం
- నెలాఖరుకు మన మిత్ర ద్వారా అందుబాటులోకి 400 రకాల సేవలు
- అన్ని ప్రభుత్వశాఖల జిఓలు సింగిల్ ప్లాట్ ఫాంపైకి తేవాలి
- ఎలక్ట్రానిక్స్, ఆర్‌టిజిఎస్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి: రాష్ట్రంలో కొత్తగా తమ సంస్థలను ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్ గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు ఆసక్తిచూపుతున్న కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి సమీక్షిస్తూ ఇప్పటివరకు 91 ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రూ.91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి, వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలి, సాధ్యమైనంత త్వరగా కంపెనీలు ఏర్పాటుచేసేలా సంబంధిత కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయి, రాబోయే అయిదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ అన్నారు. ఐటి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించండి. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్ మెంట్ ను ఆధునీకరించండి. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయండి. ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రస్తుతం 317రకాల సేవలు మనమిత్ర యాప్ లో అందుబాటులో ఉన్నాయి. నెలాఖరుకు 400రకాల సేవలకు విస్తరించండి. రెవిన్యూశాఖతో పాటు వివిధరకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్ తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్ లో వచ్చేలా ఏర్పాట్లు చేయాలి, బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్ లు పంపేలా చూడాలి. ఆర్ టిజిఎస్ కు సంబంధించి డేటా పాయింట్లు, కెపిఐలను ఇంటిగ్రేట్ చేయాలి. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్య పథకాలనకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్ టిజిఎస్ లో పొందుపర్చాలి. సచివాలయం నుంచి గ్రామస్థాయి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను అనుసంధానం చేయండి. తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్ టైమ్ లో అందించేలా చర్యలు తీసుకోండి. జూన్ 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయండి. వివిధ శాఖలకు సంబంధించి సమాచారాన్ని అంతంటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్ సైట్ లో పొందుపర్చి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మరింత సరళతరం చేసేలా చర్యలు చేపట్టాలి. వివిధ రకాల చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలకు సంబంధించి సింగిల్ సర్టిఫికేషన్ ఉండేలా క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అనుసంధానించాలి. ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల జిఓలు, యాప్ లను సింగిల్ ప్లాట్ ఫాంపైకి తెచ్చి ఒకే వెబ్ సైట్ లో అందుబాటులోకి తేవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎండి సూర్యతేజ్, ఆర్ టిజిఎస్ సిఇఓ ప్రకార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలి



- మంత్రి నేతృత్వంలో బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో పూజలు
- జాతీయతను పెంపొందించే విషయంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది
- ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి ఆపదలను దూరం చేయాలని ప్రార్ధనలు
- మంత్రి కందుల దుర్గేష్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తూర్పుగోదావరి: పాకిస్థాన్ కు గట్టి గుణపాఠం చెప్పిన దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలనుసారం జనసేన తరపున పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, వీర మహిళలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లో షష్ఠ షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో మంత్రి కందుల దుర్గేష్ వేద మంత్రోచ్చరణల మధ్య అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని ఆశీస్సులు దేశ సైనికులకు తోడుగా ఉండాలని కాంక్షించారు. పాకిస్తాన్ ముష్కరులను అణిచివేసేలా చూడాలని భగవంతున్ని ప్రార్థించానన్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య విధులు నిర్వహిస్తున్న సైనికులకు తోడుగా యావత్ దేశ ప్రజలు అందరూ అండగా ఉన్నామని భరోసానిచ్చారు. జాతీయతను పెంపొందించే విషయంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. తొలుత నిడదవోలు నుండి వేమగిరి మీదుగా మంత్రి కందుల దుర్గేష్ తో పాటుగా జనసైనికులతో ప్రారంభమైన బస్సు యాత్ర బిక్కవోలుకు చేరుకున్న అనంతరం ఎలాంటి విఘ్నాలు లేకుండా కార్యక్రమం సజావుగా జరగాలని ప్రఖ్యాత పురాతన లక్ష్మీ గణపతి వారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆ తర్వాత జాతీయపతాకాలు పట్టుకొని జనసైనికులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రి దుర్గేష్ కు ఆశీర్వచనం చేశారు.

ఈ సందర్భంగా ఆలయం వెలుపల మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మన దేశం ఆర్థికంగా, సైనిక శక్తిగా దృఢంగా ఉన్నా దేవుడి ఆశీస్సులు కూడా మెండుగా ఉండాలనే ఉద్దేశ్యంతో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన పిలుపుమేరకు బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించానని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడే గొప్ప శక్తిసామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం దేశ త్రివిధ దళాలకు మెండుగా ఉన్న నేపథ్యంలో వారి కోసం దేశమంతా ప్రార్థించే సమయమిది అని గుర్తుచేస్తూ నిర్వర్తించిన పూజలు సైనికులకు మరింత బలం చేకూర్చాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. దేశ ప్రజలు సురక్షితంగా ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు. సురులను కాపాడి అసురులను సంహరించిన సుబ్రహ్మణ్యస్వామిలా నేడు దుష్టముష్కరుల నుండి, ఉగ్రవాదం నుండి భారతదేశాన్ని కాపాడుతున్న నిజమైన సైన్యాధ్యక్షులు భారతసైనికులు అని మంత్రి దుర్గేష్ అన్నారు. భారత సైన్యం చూపిస్తున్న తెగువ, చేస్తున్న త్యాగం దృష్టిలో పెట్టుకొని వారికి ఆత్మస్థైర్యం, ధైర్యం ఇవ్వాలని దేవున్ని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు శాంతికాముకంగా ఉన్న భారతదేశంలో ఎలాంటి అరాచకాలు జరగొద్దని కాంక్షించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశ సమగ్రతకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అమాయకులైన 26 మంది పర్యాటకుల్ని పహల్గాంలో పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకల్ని భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ తో ఇప్పటికే తుద ముట్టించిందని వెల్లడించారు. ఈ క్రమంలో పాకిస్థాన్ మీద చేస్తున్న ధర్మ యుద్ధంలో భారత సైన్యానికి, ప్రధాని మోదీకి భగవంతుని ఆశీస్సులు, దైవబలం మెండుగా ఉండాలని ప్రార్థించామన్నారు. ఆపరేషన్ సిందూర్ తో దేశానికి ఆపదలను దూరం చేయాలని ప్రార్ధనలు చేశామన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం, దేశ సమగ్రత కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సైనికులకు నివాళులు అర్పించారు. సరిహద్దుల్లో సైనికుల పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు. కీలక సమయంలో దేశ ప్రజల ఐక్యత నిరూపితమైందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జై జవాన్, భారత్ మాతాకీ జై, జయహో భారత్ అంటూ మంత్రి కందుల దుర్గేష్ నినదించారు.

## సహజ మరణాలను కూడా లాకప్ డెత్‌లుగా చిత్రీకరికస్తున్న పత్రికలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రకాశం జిల్లాలో లాకప్ డెత్.? పేరిట అసత్య కథనాలను ప్రచారం చేస్తున్న వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించనున్నదని డీజీపీ హరీష్ కుమార్ గుప్త హెచ్చరించారు. ప్రభుత్వాన్ని, పోలీసు విభాగాన్ని అపఖ్యాతిపర్చే దురుద్దేశంతో ప్రచారం చేసే మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఖాతాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇవి ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందన్నారు. విచారణలో భాగంగా, ఈ కేసుకు సంబంధించిన అనుమానితులను, సాక్షులను చట్టబద్ధంగా ప్రశ్నించడం జరిగిందని వివరించారు.

## లిక్కర్ కేసులో అరెస్టుకు బ్రేక్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అప్పటికే మద్యం కేసులో మిధున్ రెడ్డిని నిందితుడిగా చేర్చకపోవడం, అరెస్ట్ చేసే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన క్రమంలో ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మిధున్ రెడ్డిని నిందితుడిగా చేర్చిన నేపథ్యంలో మెరిట్స్ ఆధారంగా మళ్లీ తాజాగా వాదనలు విని ముందస్తు బెయిల్‌పై నిర్ణయాన్ని వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. గతంలో మిథున్‌రెడ్డికి ఇచ్చిన మధ్యంతర బెయిల్ ను కూడా సుప్రీంకోర్టు తొలగించింది. విచారణ సంస్థ చూపిన కొత్త ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకొని మిథున్‌రెడ్డి బెయిల్‌పై నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. గతంలో మిథున్ రెడ్డికి ముందస్తు బెయిల్‌ను హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో మిథున్ రెడ్డి సవాల్ చేశారు. ఆయన వేసిన పిటీషన్‌పై మంళవారం జస్టిస్ పార్ధీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. బెయిల్‌పై హైకోర్టు తీర్పు ఇచ్చేంత వరకూ అరెస్ట్ చేయబోమని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. నాలుగు వారాల్లో మిథున్ రెడ్డి బెయిల్ పిటీషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కొచ్చిన్ తీవ్రమైన వేసవి తాపంతో అల్లాడుతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లటి శుభవార్త అందించింది. దేశ వ్యవసాయానికి, ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ, అంచనాల కంటే ముందుగానే దేశంలోకి ప్రవేశించాయి. మంగళవారం నాటికి నైరుతి రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులతో పాటు దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. రుతుపవనాల ప్రభావంతో నికోబార్ దీవుల్లో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఇవి మరింతగా విస్తరించి, అండమాన్ నికోబార్ దీవుల మొత్తంతో పాటు దక్షిణ అరేబియా సముద్రం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు చేరుకుంటాయని, ఇందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఈ నెల 27వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ఐఎండీ ఇదివరకే అంచనా వేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా జూన్ 1వ తేదీన కేరళలోకి ప్రవేశించే నైరుతి, ఈసారి సుమారు నాలుగు రోజుల ముందే రానుండటం గమనార్హం. ఇది సాకారమైతే, 2009 తర్వాత రుతుపవనాలు ఇంత ముందుగా రావడం ఇదే ప్రథమం అవుతుంది. 2009లో మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని కూడా వాతావరణ శాఖ అంచనా వేస్తుండటం ఊరటనిచ్చే అంశం. భారతదేశంలో దాదాపు 52 శాతం సాగుభూమి వర్షాధారంగానే ఉంది. దేశ వ్యవసాయ ఉత్పత్తిలో 40 శాతం ఈ భూముల నుంచే వస్తుంది. ఈ నేపథ్యంలో, దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వానికి నైరుతి రుతుపవనాలే ఆధారం.

## మురళీ నాయక్ తల్లిదండ్రులకు మాజీ సీఎం జగన్ పరామర్శ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : భారత్- పాకిస్తాన్ ల మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన అగ్నివీర్ జవాన్ మురళి నాయక్ యువతకు స్ఫూర్తి దాయకమని అన్నారు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యుడు జగన్ ..శ్రీ సత్యసాయి జిల్లాలోని గోరంట్ల మండలం కల్లితాండ గ్రామాన్ని సందర్శించారు. , ఇటీవల భారత దేశ తరవున పాకిస్తాన్‌తో యుద్ధంలో పోరాడి వీర మరణం పొందిన మురళి నాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయ్‌లను, వారి బంధువులను పరామర్శించారు. జగన్ సుమారు 20 నిమిషాలకు పైగా నాయక్ తల్లిదండ్రులతో ఉన్నారు. ఈ సందర్భంగా మురళి నాయక్ మరణం విషయం, దీనికి ముందు మురళి నాయక్ చదువుల్లో ఎలా ఉన్నాడు. ఆది నుంచి మిలిటరీ పట్ల మురళి నాయక్ కు ఉన్న మక్కువ తదితర అంశాల గురించి మురళి తల్లిదండ్రులు జగన్‌కు వివరించారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ మురళి నాయక్ త్యాగం ఆంధ్ర రాష్ట్రానికి గర్వకారణమ్ని అన్నారు. మురళి నాయక్ ను సజీవంగా తీసుకురాలేనప్పటికీ, ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం, ప్రకటించిన ఇతర సదుపాయాలు పట్ల జగన్ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సందర్భంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరవున తమ వంతు బాధ్యతగా రూ 25 లక్షలు ఆర్థిక సహాయం అందజేసి, అన్ని విధాల ఆ కుటుంబానికి తోడుగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష్రశీ చరణ్, మాజీ ఎమ్మెల్యేలు వై విశ్వేశ్వర్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, అత్తిరు చాంద్ బాషా, కదిరి నసమన్వయకర్త వైకాపా సమన్వయకర్త బిఎస్ మక్బూల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతూరులో పరిశ్రమలు పెట్టండి

- రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజ
- ఎంఎస్ఎంఈ పార్కులతో ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్త
- ఇదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్న మంత్రి సవిత
- అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- జగన్ హయాంలో పారిశ్రామికంగా కుంటుపడిన ఏపీ : మంత్రి సవిత

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి.. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. మన యువతకు ఉద్యోగిలిచ్చి... రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించండి అని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీని పారిశ్రామిక హబ్ గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**తొలి దశలో 20 ఎకరాల్లో...**

రొద్దం ఎంఎస్ఎంఈ పార్కులో తొలి దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్లు చొప్పున భూ కేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

**సొంతూర్లో పరిశ్రమలు పెట్టండి...**

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఒకవైపు రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తూనే, మరో వైపు సాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులను తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా రూపురేఖలే మారిపోయాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువత ఎక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు, సొంతూర్లోనే కంపెనీలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు వల్ల వచ్చే ఆదాయం అక్కడి ప్రభుత్వాలకు, ప్రజలకు ఉపయోగపడతుందన్నారు. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ఆదాయం...స్థానిక ప్రజలకు, ప్రభుత్వానికి లభ్యమవుతుందన్నారు.




**చంద్రబాబు రాకతో పారిశ్రామిక రంగానికి ఊతం**

గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని, ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి బయటకు పంపించేశారని అన్నారు. జే ట్యాక్స్ చెల్లించాలంటూ పారిశ్రామిక వేత్తలను వేధించారని, ఫలితంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు.



# రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు : మంత్రి లోకేష్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రూ.91,839 కోట్ల పెట్టుబడితో, 1,41,407 ఉద్యోగాలను కల్పించేందుకు సుమారు 91 దిగ్గజ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై ఇవాళ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూవుతున్న ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని స్పష్టం చేశారు. పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా, మన మిత్ర యాప్‌లో అందుబాటులో ఉన్న 317 సేవలను నెలాఖరు నాటికి 400కు పెంచాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ధవపత్రాలకు బ్లాక్‌చెయిన్, క్యూ ఆర్ కోడ్ సాంకేతికత జోడించాలని, పన్నుల బకాయిల వివరాలను వాట్సాప్ ద్వారా తెలిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విశాఖలో జూన్ 9, 10 తేదీల్లో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు.

# సుదీర్ఘ సముద్ర తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీ

● ప్రతి 50 కి.మీ ఒక పోర్ట్ లేదా ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు లక్ష్యం
● కేంద్ర సాయంతో దుగరాజపట్నంలో రూ.3,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రం
● కేంద్ర ప్రభుత్వ పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సుదీర్ఘ సముద్ర తీరం ద్వారా రాష్ట్రంలో పోర్ట్ ఆధారిత ఎకానమీని సాధించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో 1000 కి.మీ పైగా ఉన్న సముద్ర తీరాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకుని మారిటైం ప్రాజెక్టులు నెలకొల్పుతామని సిఎం అన్నారు. రాష్ట్రంలో తీర ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులు, పోర్టులపై సిఎం సచివాలయంలో సమీక్ష చేశారు. కేంద్ర ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖ సెక్రటరీ టి.కె. రామచంద్రన్ తో పాటు పలువురు కేంద్ర రాష్ట్ర అధికారులతో సిఎం రివ్యూ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మాణం అవుతున్న పోర్టుల స్థితిగతుల పై చర్చించారు. తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ ఒక పోర్ట్ లేదా ఒక ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే ఆలోచనతో తాము ఉన్నామని సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో నెల్లూరు జిల్లా దుగరాజపట్నంలో పోర్ట్, ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు నాడు కేంద్రం అంగీకరించింది. కొత్త జిల్లా ఏర్పాటుతో తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు అంశంపై వారితో చర్చించారు. ఇనిషియల్ ఫీజిబులిటీ రిపోర్ట్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. దుగరాజపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల క్లస్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్తో కలిపి అభివృద్ధి చేస్తారు. 4 డ్రై డాక్లు, అవుట్ ఫిటింగ్ జెట్టీలు, షిప్ లిఫ్ట్ సౌకర్యం కలిగిన నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడ వస్తుంది. షిప్ బిల్డింగ్ పరిశ్రమకు 1000 ఎకరాలు, అనుబంధ పరిశ్రమలకు మరో 1000 ఎకరాలు భూమి అవసరం ఉంటుంది. ఈ ప్రాజెక్టు చేపట్టడానికి కేంద్రం దాదావు రూ.3,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపడుతుంది. భూసేకరణతో పాటు పరిశ్రమకు అనువైన ప్రాంతంగా దీన్ని తీర్చిదిద్దుతారు. తరువాత స్పెషల్ పర్పస్ వెహికిల్ () ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి సంస్థలను ఆహ్వానించి ఇక్కడ షిప్ బిల్డింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తారు. నౌకా నిర్మాణ కేంద్రం ద్వారా దాదావు రూ.26 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ది చేకూరుతుంది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. దీనికి అవసరమైన కార్యాచరణ వెంటనే సిద్ధం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ పోర్టులో మరింత చౌకగా సరుకు రవాణాకు అవకాశం కల్పించాలని సిఎం కేంద్ర అధికారులను కోరారు. అదే విధంగా రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను కూడా ఈ సమావేశంలో అధికారులు వివరించారు. పోలవరం, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో రివర్ క్రూయిజ్ సర్క్యూట్స్ ను అభివృద్ధి చేసే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సమీక్షలో మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

# వంశీకి బెయిల్

● సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు ● ఫిబ్రవరి 13న అరెస్ట్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గన్నవరం వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరైంది.. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టైన వల్లభనేని వంశీ బెయిల్ కోసం ఎస్సీ ఎస్టీ కోర్టులో బెయిల్ కోసం పిటిష్న్ దాఖ్లు చేశారు.. విచారించిన కోర్టు ష్యుర్తో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వంశీ.. రెండు సార్లు కూడా బెయిల్ తిరస్కరించింది కోర్టు.. దీంతో.. మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వంశీ.. ఆ పిటిషన్‌పై ఇటీవల ఇరు వర్గాల తరవు న్యాయవాదులు వాదనలు విన్న కోర్టు.. ఈ రోజు వల్లభనేని వంశీ మోహన్‌కు బెయిల్ మంజూరు చేసింది.. ఈ కేసులో వల్లభనేని వంశీ తో పాటు మరో నలుగురు నిందితులకు కూడా బెయిల్ ఇచ్చింది విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం.. అయితే, వల్లభనేని వంశీ మొదట సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్ట్ అయినా.. ఆ తర్వాత ఆయనపై వరుసగా మరిన్ని కేసులు నమోదు అయ్యాయి.. వంశీపై మొత్తం ఆరు కేసులు పెట్టారు.. ఆ ఆరు కేసుల్లో ఐదు కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ పొందారు వల్లభనేని వంశీ మోహన్.. కానీ, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇంకా వంశీకి బెయిల్ రాలేదు.. ఈ కేసులో ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు వంశీ.. దీంతో, ఇప్పుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ వచ్చినా.. ఆయన జైలులో ఉండాల్సిన పరిస్థితి ఉంది.. కాగా, సత్య వర్ధన్ కిడ్నాప్ కేసులో ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాద్‌లో వల్లభనేని వంశీ మోహన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే..

# రాష్ట్రంలో మరో 16 ఆలయాల్లో ప్రతినిత్యం అన్నప్రసాదం

● సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆలయాల అభివృద్ధి
● ఆగమ పండితుల నిర్ణయాల మేరకే ఆలయాల్లో పూజాకైంకర్యాలు ● మంచి రుచి, శుచి గల అన్నప్రసాదం అందించడానికి చర్యలు ● ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత, భక్తుల భద్రతకు పెద్దపీట ● ప్రముఖ ఆలయాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ
● ప్రతి ఆలయంలోనూ భక్తులు సంతృప్తి చెందేలా ఏర్పాట్లు ● రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో మరో 16 ప్రముఖ ఆలయాల్లో ప్రతినిత్యం అన్నదాన కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఉదయం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవాదాయశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశం వివరాలు, సీఎం ఆదేశాల మేరకు దేవాదాయశాఖలో అమలుచేస్తున్న కార్యక్రమాలను మంత్రి వివరించారు. ఆలయాల్లో అన్న ప్రసాదం పూర్తిస్థాయిలో జరగాలని, రోజువారీగా మెనూ తయారు చేయాలని, పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు వండాలని, భక్తులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రధానమైన ఏడు ఆలయాలలో అన్న ప్రసాదం వితరణ ఇప్పటికే జరుగుతుందని, మరో 16 ప్రముఖ దేవాలయాలలో కూడా అన్న ప్రసాదం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఈ మేరకు చర్యలు చేపడ్తున్నట్లు మంత్రి చెప్పారు. అన్న ప్రసాదం వితరణ కోసం ఎంత ఖర్చువుతుందనే వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఒకటి రెండురోజులు మాత్రమే తెరిచే ఆలయాలు కొన్ని వున్నాయని, అందులో కందుకూరు సమీపంలోని మాలకొండ లక్ష్మీనరసింహ ఆలయం ఒకటిగా మంత్రి చెప్పారు. మాలకొండలో ఇప్పటికే ప్రతి శనివారం అన్నదానం అందిస్తున్నప్పటికీ ఇకనుంచి ఒక ప్రత్యేక కార్యక్రమంగా అన్నప్రసాదాన్ని భక్తులకు అందిస్తామని మంత్రి చెప్పారు.

ప్రతి దేవాలయంలో పూజా కార్యక్రమాలు ఆగమపండితుల ఆధ్వర్యంలోనే జరగాలని ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఉండకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు అన్ని ఆలయాల్లో ఆగమ పండితుల నిర్ణయాల మేరకు పూజాకైంకర్యాలు చేపడుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ప్రధానంగా నాలుగు రకాల దేవాలయాలు ఉన్నాయని, ఆలయాలకు వచ్చేటువంటి వార్షిక ఆదాయమును బట్టి ఆలయాలు విడివిడిగా విభజించడం జరిగిందన్నారు. 6ఏ కేటగిరీలో ఉన్న 169 ఆలయాల్లో ఆ ఆలయాల్లో ఉన్నటువంటి ఆదాయ వనరులను బట్టి, కొంచెం ఆదాయం వనరులు అధికంగా ఉన్న 22 ఆలయాల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్యక్రమాలు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. భక్తుల భద్రత కోసం ప్రముఖ ఆలయాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని ఆనం చెప్పారు. ప్రతి ఆలయంలో ఆధ్యాత్మికత భావన ఉట్టిపడేలా అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు ఆలయాల్లో శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు జరిగేలా, ప్రతిరోజూ తెల్లవారుజామునుంచే ఆలయాల్లో ఓంకారనాదం, మంత్రోచ్ఛరణలు వినిపించేలా, ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.

ప్రముఖ శక్తిపీఠం, జ్యోతిర్లింగమైన శ్రీశైలం ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని, ఈ ప్రముఖ శైవ క్షేత్రం వచ్చేటువంటి భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అలాగే శ్రీశైలం దేవస్థాన అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. శ్రీశైలంలో అటవీశాఖకు, దేవాదాయ శాఖకు మధ్య భూ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అతి త్వరలో సమావేశం ఏర్పాటు చేయబోతున్నారన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం శ్రీశైలం దేవస్థానాన్ని తీర్చిదిద్దనున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలు, శైవక్షేత్రాలతో పాటు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి గారి ఆదేశాలు, సూచనలు పాటిస్తూ దేవాదాయశాఖ అభివృద్ధికి చర్యలు చేపడ్తున్నామని, ప్రతి ఆలయంలోనూ భక్తులకు సంతృప్తికరంగా దర్శన, వసతి ఏర్పాట్లు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

# ల్యాండ్ రికార్డ్ డిజిటలైజేషన్‌పై రెండు రోజుల వర్క్‌షాప్

● గుంటూరులో కార్యక్రమం నిర్వహణ
● 15, 16 తేదీల్లో స్థానిక ఐటీసీ వెల్కమ్ హెూటల్‌లో ఏర్పాటు
● పాల్గొననున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : జాతీయ స్థాయిలో జరుగుతున్న కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ వర్క్ షాప్ ఈసారి గుంటూరు కేంద్రంగా జరగబోతుంది. గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రయత్నం కారణంగా ఈ వర్క్ షాప్ రెండు రోజులు పాటు గుంటూరులో ఈ వర్క్ షాప్. జరుగుతుందని కేంద్రమంత్రి కార్యాలయం మంగళవారం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశంలోని ప్రతీ పౌరుడికి ఆధునిక సాంకేతికతతో కూడిన భూ రికార్డులను అందించడమే చేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుంది. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఉద్దేశించి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ రెండు రోజుల వర్క్ షాప్ ను ప్రజల ముందుకు తీసుకురానుంది. కాగా గ్రామీణ అభివృద్ధి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని తీసుకున్న ప్రత్యేక చొరవతో గుంటూరులో చేపడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాగా గుంటూరులోని స్థానిక ఐటిసి వెల్కమ్ హోటల్లో మే నెల 15, 16వ తేదీల్లో ఈ వర్క్ షాప్ ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ,, ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ,, ఏపీ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన సెక్రటరీ జయలక్ష్మి , కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సెక్రటరీ మనోజ్ జోషి అలాగే వివిధ రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇతర అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

# వినుకొండ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● నలుగురు దుర్మరణం ● దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్





వినుకొండ, మేజర్ న్యూస్ : వినుకొండ మండలం శివాపురం వద్ద బొప్పాయి కాయల లోడుతో నరసరావుపేట వైపు వస్తున్న బొలెరో ట్రాలీని ఎదురుగా వస్తున్న లారీ మంగళవారం ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గడ్డమీదిపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు మృతి చెందారు. పమాదం లోరెండు వాహనాలుబోల్తాపడ్డాయి. బొలెరో వాహనంపై కూర్చున్న వ్యవసాయ కూలీలు దాని కింద చిక్కుకుపోయారు. వీరిని కాపాడటానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. వాహనాన్ని పక్కకు తీసేసరికి ముగ్గురు దాని కింద పడి మరణించారు. గాయపడిన మరో నలుగురిని వినుకొండ ఆసుపత్రికి తరలించారు. వినుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మరో వ్యవసాయ కూలీ దారిలో మృతి చెందాడు .. ప్రమాదంలో మృతి చెందిన వారిలో.పగడాల సుబ్బమ్మ, రమణారెడ్డి, బొట్టు అంకమ్మ, బొట్టు రామాంజిగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన బొలెరో వాహన డ్రైవర్ కదిరి నాగేశ్వరావు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో పగడాల శివమ్మ, కన్నీబోయిన నాగలక్ష్మికి గాయాలు కాగా వారికి వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రమాదంపై ఏపీ ఐటీ విద్యాశాఖ మంత్రి..మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. . రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు లోకేశ్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కేసినేని నాని ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు

● రెండుసార్లు పార్లమెంట్‌కు పంపినా టీడీపీకి వెన్నుపోటు పొడిచారు
● బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం ఎగగొట్టారు ● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కేశినేని నానిపై తెలుగుదేశం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లు రాజకీయ పదవిని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. రెండుసార్లు టికెట్ ఇచ్చినా కేశినేని నాని టీడీపీకి వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మండిపడ్డారు.మాజీ ఎంపీ కేశినేని నాని అక్రమాలపై సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాస్తున్నామని తెలుగుదేశం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ తెలిపారు. కేశినేని నాని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీబీఐ అధికారులను కోరుతామని అన్నారు. ఉద్దేశ పూర్వకంగా కేశినేని నాని బ్యాంకు రుణం ఎగ్గొట్టాడని ఆరోపించారు. గత పదేళ్లు ఎంపీ పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక నేరానికి కేశినేని నాని పాల్పడ్డారని విమర్శలు చేశారు. ప్రజా జీవితంలో ఉన్నా నేతలు మాట్లాడే మాటలను, వ్యక్తిగత వ్యాపార విషయాలను ప్రజలు గమనిస్తారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ చెప్పారు.కేశినేని నాని కేశినేని శివనాథ్‌ను విమర్శిస్తే చూస్తు ఊరుకోమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ హెచ్చరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మెడికల్ క్యాంపులు, జాబ్ మేళాలు, అన్నా కాంటీన్లు, చాలా సేవా కార్యక్రమాలను కేశినేని శివనాథ్ చేశారని గుర్తుచేశారు. ఇలాంటి మంచి వ్యక్తిపై విమర్శలు చేస్తూ లిక్కర్ స్కాంను కేశినేని నాని డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. ఒక కంపెనీ పెట్టి రుణం తీసుకుని బ్యాంకుని కేశినేని నాని మోసం చేశారని ఆరోపించారు. మళ్లీ ఆ కంపెనీ పేరు మార్చి తన దగ్గర పని చేసే ఇద్దరినీ డైరెక్టర్లుగా కేశినేని నాని పెట్టారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఆరోపణలు చేశారు.ఆదాయాన్ని డైవర్ట్ చేసి ఆంధ్ర క్యాంటీన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కూతుర్ల పేరుతో పెట్టి అక్కడ మోసం చేశారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ విమర్శించారు. ఏదొక సంస్థను అడ్డం పెట్టుకుని ఆర్థిక నేరాలకు కేశినేని నాని పాల్పడ్డారని ఆరోపించారు. గత పదేళ్లు రాజకీయ పదవిని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. బ్యాంక్ పేరు, బ్యాంక్ వివరాలు, షెల్ కంపెనీల వివరాలు అన్ని చూపిస్తున్నాం కాబట్టి పూర్తి స్థాయి విచారణ జరపాలని సీబీఐ అధికారులను కోరారు. రెండుసార్లు టికెట్ ఇచ్చినా కేశినేని నాని టీడీపీకి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రాజకీయాల్లో లేను అంటూనే ఒక రాజకీయ ఏజెండాతో లిక్కర్ స్కాం విషయాన్ని పక్క దారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఆరోపించారు.గత పదేళ్లలో ఏనాడైనా కేశినేని నాని విజయవాడ అభివృద్ధి గురించి మాట్లాడరా అని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల్లో కేశినేని శివనాథ్ పర్యటిస్తున్నారని తెలిపారు. తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో యువతకు కేశినేని శివనాథ్ ప్రోత్సహం అందిస్తున్నారని అన్నారు. కేశినేని నాని ఇప్పటికైనా విమర్శలు మాని నైతిక విలువ కాపాడుకోవాలని హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లాలో 7 మంది శాసన సభ్యులు ఈ 11 నెలల్లో కేశినేని శివనాథ్ చేసిన అభివృద్ధి ఏంటో చెబుతామని అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు కేశినేని నాని పదేళ్లలో ఏం చేశారని కొలికపూడి శ్రీనివాస్ ప్రశ్నించారు.

# జయహో భారత్...

● భారత్ కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధం
● భారత్ సైనికులకు మద్దతుగా మంగళగిరిలో నమాజ్ దువా




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు భారత్ కు పాకిస్తాన్ కు జరుగుతున్న యుద్ధంలో మన భారత సైనికులు కు దైవ బలం కలగాలని , వీరమరణం పొందిన మన సైనికుల ఆత్మలకు శాంతి కలగాలని జనసేన పార్టీ ముస్లిం సోదరులు ఇస్లాం ధర్మం విశ్వసించేవారు శ్రీ మౌలానా మస్తాన్ సాబ్ నజ్వీ నేతృత్వంలో మంగళగిరి బైపాస్ రోడ్ లోని కన్వెన్షన్ హాల్ నందు మంగళవారం మధ్యాహ్నం జొహార్ నమాజ్ దువా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చిల్లపల్లి శ్రీనివాసరావు గారు మరియు జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ గారు, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మిర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్ గారు, ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్ గారు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ నయబ్ కమల్ గారు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసరావుపేట ఇంచార్జ్ సయ్యద్ జిలాని గారు తదితరులు హాజరయ్యారు.అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ఉగ్రవాదం వేరు ముస్లిం సమాజం వేరు అంటూ గతంలో పవన్ కళ్యాణ్ గారు వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. వీటిని వైసీపీ నేతలు వక్రీకరించటం దారుణమని విమర్శించారు. భారత్ కోసం ప్రాణాలర్పించేందుకు పాకిస్తాన్ టెర్రరిస్టుల ప్రాణాలు తీసేందుకు సిద్ధమని ప్రకటించారు. సరిహద్దుల్లో యుద్ధం చేసేవారికి దైవబలం చేకూరాలని పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు మంగళగిరిలో ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అమాయకుల ప్రాణాలను తీస్తున్న టెర్రరిస్టులకు ఇస్లాం మతం పేరెత్తె అర్హత కూడా లేదని అన్నారు. ప్రజలపై ఉగ్రవాదుల చర్యలు సిగ్గుచేటని అన్నారు. భారతదేశంలో నివసించే ప్రతి ఒక్కరూ భారతీయులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం నియోజకవర్గంలో రూ.13 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్క్..

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు అనగానే సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే చిన్నరాజప్ప..



పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పెద్దాపురం ఏడీబీ రోడ్డు వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్క్ కు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ స్టేంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్నరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శంఖుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ..గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు భవిష్యత్తు తరాల కోసం ఆలోచించే నాయకుడన్నారు. ఉపాధి కల్పన తోపాటు ఆర్థికంగా రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా నిలిపేందుకు ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయడం కోసమే ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో ప్రతి ఇంటికి ఒక ఐటీ ఉద్యోగి అని చంద్రాబాబు పిలువునిస్తే చాలా మంది ఎగతాళి చేశారని కానీ ఆ ఫలితాలను మనం గత 20 ఏళ్లలో చూశామన్నారు. విజన్-2047 ద్వారా స్వర్ణాంధ్ర సాధించాలంటే పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి చాలా అవసరం మని, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కారణంగా ఉపాధి కల్పన జరగడమే కాకుండా ఆర్థికంగానూ రాష్ట్రం పరివుష్టం అవుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలుగా మారే యువతను ప్రోత్సహించేందుకు పెట్టుబడినిధిలో, విద్యుత్ బిల్లుల్లో తోపాటు అనేక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తోందని మంత్రి తెలిపారు.

మరో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. భారతదేశ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందన్నారు. వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగంపై ఆధారపడెలా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మేకిన్ ఇండియా పిలుపుమేరకు స్థానికంగానే పరిశ్రమ స్థాపించి పదిమంది యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు నిర్మాణం చేపడుతుందని రాష్ట్ర మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కులలో పెద్దాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కు అతిపెద్దదన్నారు. సుమారుగా 29 ఎకరాల్లో రూ.13కోట్ల వ్యయంతో ఈ పార్కు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పార్కు ను ఫ్లాట్లుగా విభజించి పరిశ్రమ స్థాపనకు అవసరమైన రోడ్లు, విద్యుత్, నీరు వంటి ఇతర వసతులు అన్ని ఈ ఎంఎస్ఎంఈ పార్కు లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పార్కును రానున్న సంవత్సరకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్నరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురంలో 29 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పార్కు ద్వారా 5వేల మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుకోవచ్చు అని ఆయన తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజా పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.రమణారెడ్డి, డీఎల్డీవో కెఎస్వీ.ప్రసాద్ రావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్య
విజయవాడ
బుధవారం
14 మే 2025
4
సంపాదకీయం
editpage@suryaa.com

# నరేంద్ర మోడీ రచిస్తున్న ఆపరేషన్ సింధూర్

■ పాక్ ఉగ్ర మూకలు చేసిన పాశవిక కాల్పులకు యాత్రికులు బలి ■ మతం అడిగి మరీ కాల్చేసిన ముష్కరులు ■ ఉగ్రవాదులను తయారు చేసే ప్యాక్టరీలను నేలమట్టం చేసిన భారత సేనలు
■ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్న నరేంద్ర మోడీ
■ ప్రధాని చర్యలకు మద్దతు పలుకుతున్న 144 కోట్ల భారతీయులు




డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

22 ఏప్రిల్ 2025న పెహల్గామ్‌లో పాక్ ఉగ్ర మూరులు చేసిన పాశవిక కాల్పుల్లో 25 మంది హిందువులు (మొత్తం 26 మంది పురుషులు) ప్రాణాలు కోల్పోవడంతో భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయి. దీనికి ప్రతి చర్యగా 15 రోజుల తర్వాత 07 మే 2025 తొలి గడియల్లో "ఆపరేషన్ సింధూర్" పేరుతో భారత త్రివిధ దళాలు 23 నిమిషాల్లో జరిపిన 24 బాంబు దాడుల్లో 09 పాకిస్థాన్ / పిఓకే ప్రాంత ఉగ్రవాదులను తయారు చేసే ప్యాక్టరీలను నేలమట్టం చేయడం, ప్రతిగా పాక్ ప్రయోగిస్తున్న 50కి పైగా డ్రోన్లు, మూడు ఫైటర్ జెట్లను భారత నేలను తాకకముందే గగనతలంలోనే మన ఎస్400 రక్షణ వ్యవస్థల సహాయంతో నిర్వీర్యం చేయడం చూసాం. కడపటి వార్తలు అందేసరికి కూడా దిక్కుతోచని పాక్ సరిహద్దుల వెంట జనావాసాలపై కాల్పులు జరపడం, డ్రోన్లు ప్రయోగించడం, వాటిని భారత్ ముందే పసిగట్టి నాశనం చేయడం కొనసాగుతున్నది.

**నేటి విజయం వెనుక నరేంద్రుడి నాటి ముందు చూపు:**

నేడు భారత్ సాధిస్తున్న ఆపరేషన్ సింధూర్ 1.0, ఆపరేషన్ సింధూర్ 2.0ల విజయం వెనుక దశాబ్దకాలా కిందనే ముందు చూపు, భారత రక్షణ రంగానికి అత్యంత ఆధునిక దేశీయ, విదేశీ ఆయుధ సంపత్తిని అందించడం, విదేశీ పర్యటనలతో వివిధ దేశాలతో దౌత్యపరమైన సత్సంబంధాలను నెలకొల్పడం, అడుగడుగునా దేశ రక్షణ విషయంలో మోడీ మార్కు చూపించడం గమనార్హం. ఇలాంటి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్న నరేంద్ర మోదీ 144 కోట్ల భారతీయులను ఏకం చేయగలిగారు, రోషం పుట్టించుటలో కృతకృత్యులు అయ్యారు. నేడు ప్రపంచమంతటా భారత్ వైపు, ఉగ్ర పాకిస్థాన్ మరో వైపు నలవడానికి మోదీ చేసిన గత దశాబ్దకాలపు దౌత్య నీతి పునాదిగా నిలుస్తున్నది. 26 మే 2014 శుభ సాయంకాల వేళ నరేంద్ర మోదీ భారత ప్రధానిగా ప్రమాద స్వీకారం చేసి, 30 మే 2019న రెండవ పర్యాయం ప్రధానమంత్రిగా, 09 జూన్ 2024న ముచ్చటగా మూడవ సారి ప్రధానమంత్రిగా ప్రమానస్వీకాం చేసిన విషయాలు మనకు తెలుసు. గత 11 ఏళ్లుగా భరతమాత సేవలో అనేక సవాళ్లు ఎదుర్కొంటూనే, సాహసాల విజయాలను మూటగట్టుకుంటున్నారు. 2014 నుంచి 2025 వరకు దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 88 విదేశీ పర్యటనలు చేసి వివిధ దేశాలతో సత్సంబంధాలను నెలకొల్పారు. నాడు మోదీ అనవసరంగా విదేశీ పర్యటనలు చేస్తూ కోట్ల డబ్బు వృధా చేస్తున్నాడని గగ్గోలు పెట్టిన నోళ్లు నేడు మూత పడ్డాయి. భారత కేంద్ర బడ్జెట్‌లో సాలీనా దాదాపు 8 – 9 శాతం (₹6,21,940 కోట్లు) నిధులను రక్షణశాఖకు కేటాయించడం, కాలానుగుణంగా అత్యంత శక్తివంతమైన, కచ్చితత్వం కలిగిన దేశీయ, విదేశీ ఆయుధాలను భారత అమ్ముల పొదలో చేర్చడంతో నేడు వాటి ప్రభావంతో పాకిస్థాన్ గడగడ వణుకుతోంది. ఇటీవల 'మేకిన్ ఇండియా' పథకం కింద ₹85,000 కోట్ల మిలటరీ ఆయుధాలు/ పరికరాలను దేశీయంగా తయారు చేయడానికి నిధులు కేటాయించడం జరిగింది.

**పాక్ మెసైల్స్‌కు అడ్డుగా భారత సుదర్శన చక్రం ఎస్400 సిస్టమ్స్:**

2018లో భారత ప్రభుత్వం ₹35,000 కోట్లు వెచ్చించి రష్యా నుంచి ఐదు ఎస్400 (సర్ఫేస్ – టు – ఏయిర్ మెసైల్) స్క్వాడ్రన్స్ ఖరీదు చేయడానికి ఒప్పందం చేసుకోగా, వాటిలో మూడు ప్రస్తుతం భారత అమ్ముల పొదలో సుదర్శన చక్రం వలె పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఎస్400 రాకతో భారత వాయుసేన మరింత బలోపేతం కావడం, నేడు పాక్ ఆయుధాలను ఆదిలోనే తుంచేయడంతో దాయాది దేశం దిక్కు తోచని దుస్థితికి చేరింది. మరో రెండు ఎస్400 సిస్టమ్స్ 2026లో భారత రక్షణ శాఖలో చేరాల్సి ఉంది. 600 కిమీ వరకు క్షిపణినా లక్ష్య పరిధిని కలిగి 400 కిమీ వరకు శత్రు ఫైటర్ జెట్స్, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లు, క్రూయిజ్ క్షిపణులనా సెకన్ల వ్యవధిలోనే నాశనం చేయగలగడం మనం అంతా టీవీల్లో ప్రత్యక్షంగా చూసి భారతమాతాకీ జై అంటూ ఎస్400 దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ (లాంగ్ రేంజ్ ఏయిర్ డిఫెన్స్ సిస్టమ్స్)ను కొనియాడాం.

**ఆపరేషన్ "సింధూర్" పేరు వెనుక మోదీ:**

పెహల్గామ్ పాశవిక దాడి అనంతరం పాక్ ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేసిన "ఆపరేషన్ సింధూర్ 1.0"లో భాగంగా 23 నిమిషాల్లో 09 స్థావరాలను నేలమట్టం చేయడం, వందకు పైగా ఉగ్ర మూరు□ల ప్రాణాలు తీయడం జరిగింది. భారత కదరక్షణశాఖ చేసిన ఈ ఆపరేషన్‌కు నరేంద్రుడే ఆపరేషన్ సింధూర్ పేరును ప్రతిపాదించడం జరిగిందని వింటున్నాం. పెహల్గామ్‌లో ప్రాణాలు కోల్పోయిన (26 మందిలో) 25 మంది భార్యల/కుటుంబ సభ్యుల సమక్షంలోన భర్తలను అత్యం పాశవికంగా కాల్చి వేసి ఆ ధర్మపత్నుల నుదుట సింధూరాన్ని చెరిపి వేయడం జరిగింది. భారత హిందూ మహిళలు అత్యంత పవిత్రంగా భావించు సింధూర్‌ని భారత చిహ్నంగా చేసుకొని, వారి త్యాగాలకు ప్రతిగా ఉగ్రవాదుల రక్తాన్ని కళ్ల చూడడం జరిగింది. అందువల్లనే ఈ ఆపరేషన్‌కు సింధూర్ అని పేరు నిర్ణయించిన నరేంద్రుడికి భరతమాత కృతజ్ఞతలు తెలుపుతోంది, ముందుకు సాగమని ధైర్యాన్ని ఇస్తున్నది. ఆపరేషన్ సింధూర్ 3.0తో వెంటనే పాక్‌ను సర్వనాశనం చేయమని కోరుతున్నది.

**భారత విజయం వెనుక పంచ పాండవులు:**

నేడు జరుగుతున్న యుద్ధం ఆపరేషన్ సింధూర్ క్షేత్రంగా భారత పాండవులకు, పాకిస్థాన్ కైరవ మూకకు మధ్యనే అని తెలుసుకోవాలి. ధర్మరాజు నరేంద్ర మోదీ పక్షాన ప్రధానంగా రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్, హెూంశాఖ కేంద్ర మంత్రి అమిత్ షా, విదేశాంగశాఖా మంత్రి జయశంకర్, ప్రధావదని రక్షణ సలహాదారు భారత జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ పంచ పాండవులుగా నేటి ఆపరేషన్‌ను నడిపిస్తున్నారు. పాక్ వైపు దుర్యోధనుడు షెహబాజ్ షరీఫ్ ప్రధానమంత్రి చుట్టు 99 మంది ఉగ్రవాదులు, మొత్తంగా 100 మంది కౌరవ మూక ఆడక ముందే ఓడినట్లు బంజర్లలో దాక్కొని ప్రాణాలు కాపాడుతునే ప్రయత్నాలు చేస్తున్నారు.

**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ – కల్నల్ సోఫియా ఖురేషీ ద్వయాన్ని ముందు నిలిపి:**

నేడు భీకరంగా జరుగుతున్న ఆపరేషన్ సింధూర్ 1.0, ఆపరేషన్ సింధూర్ 2.0ల్లో ప్రతి రోజు జరుగుతున్న పోరాట వివరాలను ప్రపంచ మీడియాకు అధికారికంగా వివరించడానికి భారత వైమానిక దళ వీరనారి వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, భారత ఆర్మీ శౌర్య ధీర వనిత కల్నల్ సోఫియా ఖురేషీలను ఎంపిక చేసి మోదీ తనదైన మార్కును చూపుతూ ప్రపంచాన్ని నివ్వెరపరిచారు. భారతనారి ఎంత ధైర్య శౌర్యవంతురాలో స్పష్టం చేయడానికి ప్రపంచంలోనే తొలిసారి ఇద్దరు భారత మహిళా సివంగులను రంగంలోకి దించిన నరేంద్రుడు సదా అభినందనీయుడు, ఆదర్శ పురుషుడిని మరోసారి రుజువు చేసుకున్నారు.

**అన్నీ తానై తెరవెనుక నిలబడి :**

నేడు కొనసాగుతున్న ఆపరేషన్ సింధూర్ మొదలైన నాటి నుంచి నేటి వరకు నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రసంగాలు చేయలేదు. రక్షణ మంత్రి, విదేశాంగా మంత్రి రూపంలో కన వాదనలను, తన అమలు వ్యూహాలను చెప్పించడం జరుగుతున్నది. ప్రతిపక్ష నాయకులతో సమావేశంలో అధ్యక్షత వహించడం మినహా నరేంద్ర మోదీ ఎలాంటి అభిప్రాయాలను నేరుగా వ్యక్తం చేయకపోవడం గమనార్హం. సంబంధిత మంత్రులు, ప్రధాని రక్షణ సలహాదారు, భారత త్రివిధ దళాల అధిపతులతో సమావేశాలు జరపడం, పరిస్థితులను విశ్లేషించడం, తీసుకోవలసిన చర్యలను నిర్ణయించడం నిరంతరం జరుగుతున్నప్పటికీ మోదీ నేరుగా దేశ ప్రజలకు ఇచ్చిన సందేశం ఏదీ లేదు. ఇది ఒక పక్కా వ్యూహం. ప్రణాళిక పక్కాగా ఉంటే లక్ష్య సాధన సులభం అవుతుందని నమ్మి అడుగడుగున పకడ్బందీ ప్రణాళికలతో త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ దేశ మిలటరీ శక్తిని ప్రపంచానికి మ–రోసారి పరిచయం చేయడంలో మోదీ విజయం సాధించారని అనడంలో అతిశయోక్తి లేదు.

నరేంద్ర మోదీ వ్యక్తిత్వం విలక్షణం. మోదీ మార్గం ధర్మపథం. నరేంద్రుడి మోధో శక్తి అమోఘం. భారతమాత ముద్దు బిడ్డ 'నమో' ప్రపంచంలోనే అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తిగా గత కొన్నేళ్లుగా కొనసాగడం భారతీ–యులకు గర్వకారణం. ఆయన మతం సనాతనం. ఆయన ఆలోచనలు ఆచరణయోగ్యాలు. భారతమంతా జై జవాన్, జా కిసాన్, జై నమో, జై ఆపరేషన్ సింధూర్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తున్నది. పాకిస్థానీ మూరు□లను నేలమట్టం చేయమని కోరుతున్నది.

# జాతికి నరేంద్ర మోదీ దృఢ సందేశం

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. భారత ప్రజలు భయాందోళనల మధ్య ఉన్న పరిస్థితిలో ఈ ప్రసంగం అత్యంత ఆవశ్యకమైంది. దేశ ప్రజలు తామేంటని, తాము ఎలా ఉండాలో తెలియక తికమకపడుతున్నారు. ఇదే సమయంలో మోదీ ప్రసంగం ద్వారా ఓ భరోసా, ఓ స్పష్టత రావాలి అనేది ప్రజల కోరికగా మారింది. ఈ ప్రసంగానికి ప్రత్యేకత ఏమిటంటే %–% ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి మాట్లాడటం కాదు, దేశాన్ని నడిపించే నాయకుడిగా, ఓ నాయకత్వ భారం మోసే యోధుడిగా, ప్రధాని మోదీ తన గళాన్ని వినిపించారు. దేశ భద్రత, సైనికుల ధైర్యం, ప్రజల బాధ్యతలు, రాజకీయ బాధ్యతలు, అంతర్జాతీయ సంబంధాలు %–% అన్నింటినీ ఒకే వేదిక మీద ఉంచి, దేశాన్ని సమగ్రంగా ముందుకు నడిపించే ప్రయత్నం ఈ ప్రసంగంలో కనిపించింది.

ఈ ప్రసంగం జరిగిన సమయంలో దేశంలో సైనిక స్థావరాలు హై అలర్ట్లో ఉన్నాయ్. పాకిస్థాన్ ఎప్పుడైనా దాడి చేయొచ్చన్న గట్టి అనుమానం ఉన్న నేపథ్యంలో భారత ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉంది. మురళీనాయక్ వంటి భారత సైనికుల వీరమరణం దేశ ప్రజల గుండెల్లో బాధ కలిగించింది. వారి కుటుంబ సభ్యులకు దేశం చింతించాల్సిన సమయం. ఈ బాధను తట్టుకుని మోదీ తన ప్రసంగం ద్వారా ప్రజలకు ఓ ఉద్దీపన ఇచ్చే ప్రయత్నం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జరిగిన ఈ ప్రసంగం, కేవలం జాతిని ఉద్దేశించిన సందేశం మాత్రమే కాదు. ఇది దేశానికి నాయకత్వం వహించేవారికి ఉన్న బాధ్యతను సూచించే ప్రసంగంగా నిలిచింది. ప్రతి పౌరుడిని ఓ భాగస్వామిగా భావిస్తూ, దేశరక్షణ కేవలం సైనికుల పని కాదు, ప్రతి పౌరునికి కర్తవ్యం అన్న సందేశాన్ని మోదీ పునరుద్ఘాటించారు.

మోదీ ప్రసంగాన్ని ప్రారంభించేటప్పుడు, ఆయన చెప్పిన తొలి పదాలే దేశవ్యాప్తంగా ప్రజల గుండెల్లో నూటికి నూరు శాతం ప్రభావం చూపించాయి. "నా ప్రియమైన భారతదేశ ప్రజలారా..." అంటూ ఆయన మొదలుపెట్టినప్పుడు, టీవీలు, మొబైళ్లలో ఈ స్వరం వినిపించగానే కోటి హృదయాలు ఒక్కసారిగా శాంతించాయి. దేశంలో చోటుచేసుకుంటున్న అనిశ్చిత పరిస్థితుల మధ్య, మోదీ గళం అనేక కుటుంబాలకు ధైర్యాన్ని ఇచ్చింది. ప్రతీ భారతీయుడు, ఈ సమయంలో దేశ నాయకుడు తనతో మాట్లాడుతున్నారన్న భావన కలిగించింది.

దేశాన్ని ఉద్దేశించిన ప్రతి పదంలోనూ బాధ్యత, తాలూకు నిస్వార్థం పరిపూర్ణంగా కనబడింది. "ఈ క్షణం లోకం భారతదేశాన్ని చూస్తోంది. ఈ క్షణం మన పౌరుల హృదయాల్లో భయం ఉంది. కానీ ఆ భయాన్ని ధైర్యంగా మార్చాలి. మనం గెలిచే నమ్మకం నాలో ఉంది" అంటూ ఆయన వ్యాఖ్యలు దేశానికి ఓ ప్రేరణగా నిలిచాయి. ఈ ప్రసంగంలో ఆయన ప్రతి పదం యుద్ధభూమిలో తుపాకీ బుల్లెట్ వలె ధైర్యాన్ని నింపింది. మోదీ ఏదీ వదలకుండా, ప్రతి అంశాన్ని సూటిగా స్పష్టంగా చెప్పారు. ప్రజల అనుమానాలు తొలగించే ప్రయత్నం చేశారు.మోదీ మాట్లాడిన తీరు, ఆయన ముఖ భావాలు కూడా దేశాన్ని ఉద్దేశించిన గొప్ప గౌరవంతో కూడుకున్నవిగా కనిపించాయి. "ప్రతి కుటుంబం నా కుటుంబమే... ప్రతి సైనికుడు నా సోదరుడే... ప్రతి మృతుడు మన కోసం జీవించిన మహావీరుడే" అని చెప్పినప్పుడు ప్రేక్షకుల కళ్లలో నెత్తురోడిన కన్నీళ్లు ద్రవించాయి.

ఈ ప్రసంగం ప్రారంభంలో మోదీ చూపించిన గంభీరత, తాను దేశ ప్రధానిగా ఉన్నప్పటికీ, ప్రజల భద్రత కోసం తాను ముందున్నాననే సందేశాన్ని చాటిచెప్పింది. ఆ మాటల్లో గర్వం లేదు, కానీ గౌరవం ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది కానీ అహంకారం లేదు. ఇది ప్రజల గుండెల్లోకి నేరుగా వెళ్లిపోయే ప్రసంగం కావడానికి ప్రధాన కారణం.

ప్రధానమంత్రి మోదీ ప్రసంగంలో కేంద్రంగా నిలిచింది భారత సైనికుల ధైర్యం. ఆయన వారి గురించి మాట్లాడిన విధానం ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. "మన సైన్యం ఎవరికీ తలవంచదు. వారు మన దేశ గర్వకారణం. ఈ దేశ భద్రతా రేఖ మన సైనికుల ధైర్యం మీద ఆధారపడి ఉంది," అని మోదీ గర్వంతో చెప్పారు.భారత సైన్యం చూపించిన వీరత్వాన్ని ప్రస్తావిస్తూ, ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని ప్రత్యేకంగా గుర్తించారు. "మన సైనికులు శత్రువులు ఎక్కడున్నారో తెలుసుకుని, గడచిన కొన్ని రోజుల్లో తొమ్మిది ముఖ్య ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశారు. ఇది వారి ప్రణాళిక, శిక్షణ, నిర్దేశిత లక్ష్యాన్ని సూచిస్తుంది. వాళ్లు మన సైనికులు కాదు గౌరవప్రదమైన దేవతలు," అని ఉత్సాహంగా ప్రకటించారు.ఇందులో మురళీనాయక్ అనే సైనికుడు వీరమరణం పొందిన సందర్భాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "మురళీనాయక్ వంటి అమర సైనికుల వల్లే ఈ దేశ భద్రత నిలబడింది. వారు పోయినప్పటికీ, వారి త్యాగం భారత మాతకు మహిమను తెచ్చింది," అంటూ మోదీ గుర్తు చేసారు. "మన సైనికుడు ఎవరో కాదు, ప్రతి కుటుంబంలో ఉన్న ఒక కొడుకు. మీరు గర్వపడాలి %–% మీ కొడుకు దేశాన్ని కాపాడుతున్నాడని." ఇది ప్రజల మనస్సులో తమ కుటుంబ సభ్యులే సైన్యంలో ఉన్నారనే మమకారాన్ని కలిగించింది. మోదీ పౌరులకు తమ సైనికుల పట్ల గౌరవాన్నిఈ ప్రసంగం ద్వారా మళ్లీ జాగృతం చేశారు.

ప్రధానమంత్రి మోదీ ప్రసంగంలో ప్రతి పదం భారత సైన్యంపై గౌరవాన్ని పెంచేలా ఉన్నది. "సైనికుల కోసం దేశం తలవంచాలి కాదు, తలెత్తాలి. వారు మనకు రక్షణ కవచం. ప్రతి విద్యార్థి, ఉద్యోగి, రైతు, పారిశ్రామికవేత్త అందరూ ఈ సైనికుల త్యాగాన్ని గుర్తుంచుకోవాలి"అని అన్నారు. ఈ విధంగా భారత సైన్యంపై చూపిన గౌరవం, ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగానికి బలాన్ని ఇచ్చింది. ఇది కేవలం మాటల ప్రభావం కాదు, ఒక దేశ నాయకుడిగా సైనికులకు గౌరవం తెలిపిన శ్రద్ధగల నివాళి.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# బిఆర్ఎస్‌లో మరో ముసలం?

■ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న కవిత ప్రకటనలు ■ నన్ను కాపాడే ప్రయత్నం చేయలేదు" అనే వ్యాఖ్యలు సర్వత్రా చర్చ ■ బహిరంగంగా విమర్శలు చేయడం, ప్రశ్నలు వేయడం పార్టీ లో ఆందోళన లు
■ న్యాయ పరంగా ఎదుర్కొంటున్న సంఘర్షణలు బహిరంగమయ్యాయంటగున్న కేడర్
■ ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలు తమ స్వతంత్రత కోల్పోయాయంటూ ఘాటు వ్యాఖ్యలు



తేజస్వి
హైదరాబాద్

బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత నిర్వహించిన ప్రెస్ మీట్ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. ఈ సమావేశం ఆమెకు సంబంధించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు, బీజేపీ–ఈడీ కుట్రలు, రేవంత్ రెడ్డి పై విమర్శలు మొదలైన అంశాల గురించి మాట్లాడేందుకు జరిగినా, ఇందులోని పలు వ్యాఖ్యలు పార్టీ అంతర్గత పరిస్థితులను కూడా బహిర్గతం చేశాయి. ముఖ్యంగా %–% "నాకు పార్టీ తరఫున తగిన మద్దతు లభించలేదు", "ఎన్నికల్లో కొన్ని మార్గదర్శక వైఫల్యాలు ఉన్నాయి", "మా ప్రభుత్వానికి కొన్ని ప్రాంతాల్లో ప్రజా మద్దతు తగ్గింది" వంటి పదాలు ఆమె నోటి నుండి రావడంతో, ఇది కేవలం వ్యక్తిగత రక్షణ కోసం చేసిన ప్రెస్ మీట్ కాదని, ఇది బీఆర్ఎస్ లోపలి అసంతృప్తిని బయటపెట్టిన వేదికగా మారింది.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, బీజేపీతో బహిరంగ పోరాటం, కాంగ్రెస్ పునరాగమనంతో తెలంగాణా రాజకీయాలు పూర్తిగా మారిపో యా యి. ఈ నేపథ్యంలో, కవిత వంటి కీలక నేత ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం, ప్రశ్నలు వేయడం అనేది పార్టీ వ్యవస్థలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపించాయి.కవిత ప్రెస్ మీట్ లో ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తులో సమస్యలను రేపేలా ఉన్నాయి. ఆమె వ్యక్తిగత న్యాయపరమైన సమస్యల గురించి మాట్లాడుతూ, "నేను మహిళగా, రాజకీయ నాయకురాలిగా తగిన మద్దతు పొందలేదు. పార్టీ నన్ను కాపాడే ప్రయత్నం చేయలేదు" అనే వ్యాఖ్యలు అనేక అనుమానాలను రేకెత్తించాయి. రాజకీయంగా అయితే, ఇది పార్టీ లోపలి విభేదాలను బయటపెట్టే విధంగా మారింది.

ఈ సందర్భంలో ఆమె ఒక కీలక వ్యాఖ్య %–% "మేము పదేళ్లు పాలించాం. తప్పులు జరిగాయనిపించవచ్చు. కానీ వాటికి బాధ్యత ఎవరి?" %–% అనే వాక్యం బీఆర్ఎస్ పరిపాలనలో ఉన్న వైఫల్యాలను స్వయంగా అంగీకరించినట్టే. ఇది బీఆర్ఎస్ నాయకత్వంపై, ముఖ్యంగా అధిష్ఠానంపై ప్రశ్నలు వేయించేలా ఉంది. ఒక మాజీ ముఖ్యమంత్రి కుమార్తెగా, బీఆర్ఎస్ పునాదుల నుంచి ఉన్న కీలక నేతగా ఆమె ఈ విధంగా మాట్లాడటమే పార్టీకి తలపట్టుకునే పరిస్థితిని తీసుకువచ్చింది.

ప్రెస్ మీట్ లో ప్రధానంగా వ్యక్తిగతంగా ఆమె ఎదుర్కొంటున్న న్యాయ సమస్యల గురించి చాలా బాధతో మాట్లాడిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. "నేను ఒక మహిళ. నాకు రాజకీయ వారసత్వం ఉన్నా, చట్టం ముందు నేను కూడా ఓ పౌరురాలినే. కానీ నన్ను ఈడీ విచారణలు, అరెస్టు బెదిరింపులు, వ్యక్తిగత జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసే మీడియా ట్రయల్స్ నుంచి ఎవరూ రక్షించలేదు," అంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలద్వారా ఆమె న్యాయ పరంగా ఎదుర్కొంటున్న సంఘర్షణలు బహిరంగమయ్యాయి.

ఆమె బహిరంగంగా చెప్పినట్టు, ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో తనపై ఉన్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరణతో ఉన్నవని ఆమె పేర్కొన్నారు. "ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా నా పేరు జోడించడం, మహిళా నాయకురాలిగా నన్ను టార్గెట్ చేయడమే కాక, రాజకీయంగా నన్ను నాశనం చేయాలన్న కుట్ర" అని ఆమె ఆరోపించారు. ఇది ఆమె వ్యక్తిగత ఆవేదన మాత్రమే కాదు, దానికి రాజకీయ ఆవేశం కూడా కలిసిన తీరు. దీనివల్ల ఆమె స్వీయ న్యాయ రక్షణ మాత్రమే కాదు, పార్టీని కూడా వ్యతిరేక ప్రభుత్వ బలాలకు బలివ్వడమన్న భావనను ప్రజల్లో నింపే ప్రయత్నం చేశారు.

ఈ ప్రసంగంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలు తమ స్వతంత్రత కోల్పోయాయి. అవి కేవలం బీజేపీకి పనిముట్టులుగా మారిపోయాయి. రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనడం వీరికి నచ్చదు. అందుకే కేసులు పెట్టడం, అరెస్టు చేయడం, విచారణ పేరుతో మానసికంగా వేధించడం జరుగుతోంది," అని ఆమె చెప్పారు. ఇది నిజానికి బీజేపీ పాలన పద్ధతులపై ఆమె వేసిన తీవ్ర ఆరోపణలుగా మిగిలాయి.

అలాగే ఆమె చెప్పిన మరొక ముఖ్యమైన అంశం పార్టీ మద్దతు లేకపో వడం. ఆమె బాధతో ఇలా చెప్పారు: "ఒకపక్క నన్ను కేంద్రం టార్గెట్ చేస్తోంది, మరోపక్క నేను బీఆర్ఎస్ తరఫున పౌరులతో, మీడియాతో నిజాలు చెప్పాలంటే నా వెనుక నిలిచే నాయకత్వం లేదు. నా భుజాలపై ముసుగు వేసి మౌనం వహించడమే నా పార్టీ చేస్తున్నది." ఈ వ్యాఖ్యలు పార్టీ లోపలి చీలికలను, మద్దతు లేకపోవడాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత వ్యాఖ్య కాదు ఇది పార్టీ వ్యవస్థ పట్ల నిస్పృహతో కూడిన సంబోధన.ఈ వ్యాఖ్యలన్నింటినీ పరిశీలిస్తే, కవిత తనపై ఉన్న కేసును ఒక వ్యక్తిగత బాధగా చూపించి, దానిని రాజకీయ కుట్రగా మలిచే ప్రయత్నం చేశారు. కానీ అదే సమయంలో ఆమె చెప్పిన మాటల్లో పార్టీ మద్దతు లేకపోవడం, తనను నిర్లక్ష్యం చేయడం అనే భావనలు స్పష్టంగా కనిపించాయి. ఇది బీఆర్ఎస్ లో ఆమె స్థానాన్ని ప్రశ్నించడమే కాకుండా, నాయకత్వం పట్ల ఆమెకు ఉన్న అసంతృప్తిని బయటపెట్టింది.కవిత వ్యాఖ్యలు ఒక్కసారి ప్రజలు విన్నాక, బీఆర్ఎస్ నాయకత్వం అంతర్గతంగా ఏం చేస్తున్నది? పార్టీలో సమన్వయం లేకపోవడం నిజమేనా? కేసీఆర్ ఆమెకు సమర్థంగా మద్దతు ఎందుకు ఇవ్వలేకపోయారు? వంటి ప్రశ్నలు ఉద్భవించాయి. ఈ ప్రశ్నలు బీఆర్ఎస్ లో అసలైన సంక్షోభానికి సంకేతాలు.

ఆమె ఒక మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, పార్టీలో వ్యవస్థాపక స్థాయి నాయకురాలిగా ఉన్నప్పటికీ, ఆమెకి పరిపూర్ణ మద్దతు లేకపోవడమే ఓ అసమంజస పరిస్థితిని బయటపెట్టింది.బీఆర్ఎస్ లో అధిష్ఠానం అంటే కేవలం కేసీఆర్ చుట్టూ తిరిగే వ్యవస్థగా మారిపోయింది. గత పది సంవత్సరాల పాలనలో పార్టీని ఒక ఫ్యామిలీ ఆధిపత్యంగా నడిపిన తీరు విమర్శలకు లోనవుతుంది. కానీ ఇప్పుడు అదే కుటుంబంలోకి చెందిన ఒక వ్యక్తి, పార్టీ లోపాలను బహిరంగంగా ప్రస్తావించడం పార్టీ అంతర్గతంగా ఎంతో లోతైన విభేదాలు ఉన్నాయన్న సంకేతం.

"ఎవరూ నన్ను బయటికి వచ్చి తగిన రీతిలో మద్దతు ఇవ్వలేదు" అనే వ్యాఖ్య, కేసీఆర్, కేటీఆర్ లాంటి సీనియర్ నాయకులు తగిన సమయంలో స్పందించలేదని ప్రతిఫలిస్తోంది. ఇది ఒకవేళ పార్టీ శ్రేణులపైనే కాదు ,పార్టీ హైకమాండ్ పైన కూడా ఆరోపణలుగా పరిగణించాలి. అధికారం చేతుల్లో ఉన్నప్పుడు తన కుటుంబ సభ్యురాలిని కూడా కాపాడలేకపోయే నాయకత్వం, ఒక సామాన్య కార్యకర్త కోసం ఏమి చేస్తుంది అనే సందేహం ప్రజల్లో తలెత్తక మానదు.ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఎదుర్కొన్న ఓటమి, ప్రజా మద్దతు తగ్గిపోవడం, ప్రజలతో మమేకం కావడంలో వైఫల్యం ఇవన్నీ కవిత మాటల్లో పరోక్షంగా ప్రతిబింబించాయి. ఆమె ప్రెస్ మీట్ లో చెప్పిన "మేము పాలించిన దశాబ్దంలో తప్పులేమీ చేయలేదన్న నేను చెప్పలేను. కొన్ని విభాగాల్లో మేము విఫలమయ్యాం" అనే వాక్యం, బీఆర్ఎస్ పాలనలో ఉన్న లోపాలను నేరుగా అంగీకరించినట్టే. ఇది కేసీఆర్ నాయకత్వానికి షాక్ లా మారింది.మరోవైపు, పార్టీకి ఎన్నికల నెగెటివ్ ఇమేజ్ ఏర్పడిందని, ప్రజల నమ్మకాన్ని కోల్పోయినట్టు చెబుతూ, ఆమె చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ సమీక్షలు కాదు ,అవి పార్టీపై ఆమెకున్న అసంతృప్తిని ప్రతిబింబించే సూచనలు.

ఇది పార్టీపై నేరుగా ప్రశ్నలే వేయడమే కాకుండా, బీఆర్ఎస్ లో నిర్ణయాలు ఎలా తీసుకుంటారు, ఎవరితో తీసుకుంటారు, ఎలాంటి నాయకత్వ తీర్మానాలు జరుగుతాయి అన్నదానిపై తీవ్ర విమర్శలే. ఇది పార్టీ అంతర్గత గోప్యతను ధ్వంసం చేయడం కాకపోయినా, ప్రజల్లో ఒక బహిరంగ సందేహాన్ని కలిగించడంలో ఖచ్చితంగా ప్రభావం చూపుతుంది.

ఒకవైపు, కవిత తనపై ఉన్న కేసులను రాజకీయ కుట్రగా చూపించి, తనను సమర్థించుకునే ప్రయత్నం చేశారు, దానితో బీఆర్ఎస్ తమ ప్రస్తుత సమస్యలను సమర్థించుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త రణకూటాన్ని ఎంచుకుంటున్నట్లు అనిపించింది. అయితే, సమర్థత, జవాబుదారీతనం, మరియు పార్టీ అంతర్గత సహకారం లేకపోవడం వంటి అంశాలు ఈ ప్రెస్ మీట్ లో కన్పించిన సమైక్యత లేమి అనేక ప్రశ్నలకు ఉదాహరణగా నిలిచాయి. మొత్తం మీద కల్వకుంట్ల కవిత ప్రెస్ మీట్ ఒక రాజకీయ పరిణామం, పార్టీ అంతర్గత సంక్లిష్టతలను వెలికితీసే ఒక సాధనంగా మారింది అనేది ఒప్పుకోవాల్సిందే!

## శాశ్వత శాంతి విశ్వం కోరుతోంది

దాదాపు మూడు సంవత్సరాలకు పైగా జరుగుతున్న రష్యా, ఉక్రైన్ యుద్ధం లో ఇరు దేశాలు నష్టపోయాయి. కాకపోతే ఉక్రైన్ కు భారీ నష్టం సంభవించింది. యుద్ధ నిర్వహణలో రెండు దేశాల సైనిక వ్యవస్థ పలు సమస్యలు ఎదుర్కొంది. యుద్ధ వీరుల లక్ష్యం కూడా శాంతి ని కోరుకోవడమే. ఈ దిశలో టర్కీ రాజధాని ఇస్తాంబుల్ లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ రెండు దేశాలను సమన్వయ పరచి చర్చలు ప్రారంభిస్తారు. ఈ చర్చలకు పుతిన్, జెలెన్ స్కి ఒప్పుకోవడం ముదావహం. ఈ గురువారం నుంచి ఇస్తాంబుల్ లో చర్చలు మొదలవుతాయి. మేం మానవతా దృక్పథం తో వ్యవహరిస్తున్నాం. అందుకే 'ఈస్టర్ డే, విక్టరీ డే సందర్భంగా కాల్పుల విరమణ పాటించి తమ పారదర్శకత నిరూపించు కున్నాం అని పుతిన్ వ్యాఖ్యాణించారు. కాని దురదృష్టం ఉక్రైన్ వీటిని పె డ చెవిన పెట్టిందని పుతిన్ వాపోయారు. అయినా సమర్ధ వంతంగా ఉక్రైన్ దాడులను అడ్డుకున్నామని

పుతిన్ చెప్పారు.ఇప్పుడు రష్యా ప్రకటించిన శాంతి చర్చలకు సిద్ధం అని జెలెన్ స్కి వ్యాక్యానించడం అతనికి యుద్ధం పై గల నష్టం తెలిసి వచ్చినట్లుంది. యుద్ధం ద్వారా అశాంతే రగులుతుందని, అభివృద్ధి కుంటు పడుతుందని అటు జెలెన్ స్కి కి ఇటు పుతిన్ కు తెలియడం గమనార్హం. ఇరు దేశాలు పట్టు విడుపులకు,మాటల పంతాలకు పోక శాంతి ని కాంక్షించాలి. రష్యా, ఉక్రైన్ యుద్ధం ముగింపుకు విశ్వం అంతా ఎదురు చూస్తోంది. దానికి మొదటి అడుగు కాల్పుల విరమణ. రెండు దేశాలు కాల్పుల విరమణకు చర్యలు తీసుకోవాలి. అందుకు ఉక్రైన్ అంగీకరించడం, సోమవారం నుంచి మొదలయ్యే ముప్పై రోజుల కాల్పుల విరమణ రెండు దేశాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి ఒక వేళ ఉల్లంగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఉల్లంగిస్తే ఆంక్షలు విధిస్తాం అని బ్రిటన్ వెల్లడి చేయగా, పలువురు ఐరో పా నాయకులు కూడా కాల్పుల విరమణే శాంతి ని ప్రొది చేస్తుందని వక్కాణించారు. ఇప్పుడు బంతి రెండు దేశాల మధ్య ఉంది. శాంతా, యుద్ధామా అనేది రష్యా, ఉక్రైన్ దేశాలు నిర్ధారించు కోవాలి.

అంది వచ్చిన అవకాశం ను ఎవరు వదులుకోకూడదు. యుద్ధం ఆగాలని టర్కీ చేస్తున్న రాయభారం ఫలించాలని, ఇస్తాంబుల్ లో శాంతి చర్చలు ఫలించాలని కొరుకుందాం. ఈ దిశలో రష్యా, ఉక్రైన్ దేశాలు కూడా శాంతికి ప్రాముఖ్యత ఇవ్వడం శుభ పరిణామం.మూడు ఏళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ముఖ్యంగా పౌరులు, వారి బంధువులు నష్టపోయారు. రెండు దేశాలలో పసి పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరణించారు, వారు ఎదుర్కొన్న అవస్థలు వర్ణించలేం. యుద్ధం ఎప్పుడు ఆగునా అని ఎదురు చూస్తున్నారు. రెండు దేశాలకు పర్యాటకులు రాక పోవడం తో ఆదాయం కూడా గణనీయంగా తగ్గి పోయింది యుద్ధ నష్టం పూడ్చకోవటం తోనే సరి పోయింది. అనేక చారిత్రక కట్టడాలు, సుందర భవనాలు నేల మట్టం కావడం దురదృష్టం. ఈ విపత్కర పరిస్థితులు చూచే టర్కీ కి ముందుకు వచ్చి రెండు దేశాల అధ్యక్షులతో చర్చించి శాంతికి శ్రీ కారం చుట్టింది. టర్కీ అధ్యక్షుడి ప్రయత్నాలు సఫలం కావాలని కోరుకుందాం.

..... కనుమ ఎల్లారెడ్డి, 93915 23027.

సూర్య
విజయవాడ
బుధవారం
14 మే 2025


## ఆపరేషన్ సిందూర్'.. 70 దేశాల దౌత్యాధికారులకు బ్రీఫింగ్

### రక్షణ నిఘా సంస్థ డీజీ లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా వివరణ

న్యూఢిల్లీ : పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్లోని ఉగ్రస్థావరాల లక్ష్యంగా మన సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. దీని గురించి రక్షణ నిఘా సంస్థ డీజీ లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా 70 దేశాల దౌత్యాధికారులకు వివరించారు. లక్ష్యాల ఎంపిక ప్రక్రియ, భారత శక్తిసామర్థ్యాల ప్రదర్శన తదితర అంశాలను తెలియజేశారు. భారత్కు వ్యతిరేకంగా ప్రత్యర్థులు చేసిన తప్పుడు ప్రచారాన్ని, దానివల్ల ప్రాంతీయ స్థిరత్వంపై గల ప్రభావాన్ని విశదీకరించారు. అలాగే ఆ తప్పుడు సమాచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న తీరును వెల్లడించారు.

ఉగ్ర ముఠాలకు అండగా ఉంటూ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. 'ఆపరేషన్ సిందూర్ 'తో శత్రుదేశాన్ని అన్నివిధాలుగా దెబ్బతీసిన న్యూఢిల్లీ.. ఇప్పుడు దాయాది పై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఈ రోజు పలు దేశాల అధికారులకు కేంద్రం ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది. ఢిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం ఈ కీలక భేటీ జరిగింది.

ఇక, బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రతాపరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మరోవైపు విదేశాంగ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులతోనూ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను కేంద్రం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ నేతృత్వంలో సమావేశం జరగనుంది. ఇందులో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. 'సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.



# ఉగ్రవాదం అంతు చూస్తాం

- సిందూరం తుడిచినవాని నట్టింటికి వెళ్లి నాశనం చేశాం
- టెర్రరిస్టుల పీచమణచడమే భారత సైన్యం శపథం
- త్రివిధ దళాల మధ్య సమన్వయం అద్భుతం
- భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుంది
- దాడి చేయాలని చూస్తే శత్రువును తుదముట్టిస్తాం
- వాయుసేనను ఎందుకు కలవాల్సి వచ్చిందో వివరించిన మోడీ
- ఆదంపుర్ ఎయిర్బేస్ ను సందర్శించిన ప్రధాని మోడీ పర్యటన



న్యూఢిల్లీ : 'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు. మంగళవారం పంజాబ్లోని ఆదంపుర్ ఎయిర్బేస్ ను సందర్శించిన సందర్భంగా జవాన్లను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. భారత్ మాతాకీ జై అంటూ ప్రసంగం ప్రారంభించారు

"ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్మెయిల్ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మారుమోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. ప్రతి భారతీయుడు సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం" అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు.

**పాక్ తప్పుడు ప్రచారానికి ఫొటోతో మోదీ చెక్..** "ఇది గౌతమ బుద్ధుడితోపాటు గురుగోవింద్ సింగ్ తిరుగాడిన నేల. శత్రువులు మన బలగాలకు సవాలు విసిరామన్న సంగతి మర్చిపోయారు. మన ఆర్మీ, నేవీ, ఎయిర్ఫోర్స్.. పాక్ సైన్యాన్ని మట్టికరిపించాయి. భారత్పై పన్నాగాలు పన్నితే తమ విధ్వంసాన్ని కొనితెచ్చుకోవడమేనని ఉగ్రగురువులు గ్రహించారు. మన సైనిక శక్తి పాక్ను నిద్రపట్టనివ్వడం లేదు. మన క్షిపణులు, డ్రోన్లు పాక్లో ఉన్న స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో ఢీకొన్నాయి. పాక్ విషయంలో మన లక్ష్మణ రేఖ చాలా స్పష్టం గా ఉంది. ఉగ్రదాడికి కచ్చితమైన బదులు ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ విషయంలో మ్యాన్ పవర్, మెషిన్ పవర్ మధ్య, త్రివిధ దళాల మధ్య సమన్వయం అద్భుతం. పాక్ ఎంత ప్రయత్నించినప్పటికీ.. మన వైమానిక స్థావరాలు, రక్షణ మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలిగించకుండా కాపాడుకున్నాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుంది. కానీ దాడి జరిగితే శత్రువును తుదముట్టిస్తుంది" అని మోదీ స్పష్టంగా హెచ్చరించారు. ఎస్–400 మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ ముందు నిల్చొని ఆయన ఈ ప్రసంగం చేశారు. ఆదంపుర్లోని ఎస్–400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసుకున్న సంగతి తెలిసిందే. అదంతా అవాస్తవమని ప్రధాని ప్రపంచానికి తెలిసేలా చేశారు.



ప్రధాని మోదీ ఏం చేసినా దానికో లెక్కుంటుంది. ఆ లెక్క వెనుక పాకిస్తాన్ తిక్క కుదిర్చే స్కెచ్ ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ స్టార్ట్ అయినప్పటి నుంచీ ప్రధాని మోదీ బయటకి కనిపించనే లేదు. ఇంట్లోనే ఉన్నారు. 24 గంటలూ సిందూర్ను పర్యవేక్షిస్తూనే ఉన్నారు. సలహాదారు అజిత్ ధోవల్తో గంటల తరబడి చర్చలు జరిపారు. సీడీఎస్, త్రివిధ దళాధిపతులతో రోజుల తరబడి వ్యూహాలు రచించారు. పాకిస్తాన్కు రోజుకో షాక్ ఇచ్చారు. దెబ్బ మీద దెబ్బ కొట్టారు. ఆపరేషన్ సిందూర్ మొదలైన రోజు రాత్రి.. ప్రధాని అసలు నిద్రనే పోలేదని అంటారు. ఉగ్ర స్థావరాలపై దాడుల అప్డేట్స్ను మినిట్ టు మినిట్ అడిగి తెలుసుకున్నారని చెబుతారు. ఆ తర్వాత పాక్ డ్రోన్ అటాక్స్ను తెగబడటం.. వెంటనే ఆర్మీ అలర్ట్ అయి ఎదురుదాడులు చేయడం.. ఇలా ఆపరేషన్ ఆసాంతం ప్రధాని కనుసన్నల్లోనే జరిగిందనేది వాస్తవం. పాక్ అణ్వాయుధాలను డ్యామేజ్ చేసి రేడియేషన్ లీక్ అయ్యే స్థాయిలో దాయాది దేశాన్ని దారుణంగా దెబ్బకొట్టింది ఆర్మీ. ఆ క్రెడిట్ ముమ్మాటికీ పీఎం మోదీకే దక్కుతుంది. ఇండియా పాకిస్తాన్ యుద్ధం ముగిసాకే.. మోదీ మళ్లీ బయట కనిపించారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. పాక్ కాళ్లబేరానికి వచ్చిందని.. ఆపరేషన్ సిందూర్ కంటిన్యూ అవుతుందని చెప్పారు. మంగళవారం నేరుగా పంజాబ్లోని అదంపూర్ ఎయిర్ బేస్కు తరలివెళ్లి మరింత షాక్ ఇచ్చారు.

**వ్యూహం ప్రకారమే అదంపూర్ టూర్** మోదీ సెలక్షన్ అదిరింది. అదంపూర్ బేస్ను ఎంచుకోవడం వెనుక పక్కా వ్యూహం ఉంది. గంటన్నర పాటు సైనికుల తో గడిపారు. వారికి అండాదండాగా నిలిచారు. జవాన్లలో ధైర్యం నింపారు. అదంపూర్లో మోదీ ప్రతీ మూవ్మెంట్ ఓ స్ట్రాటజిక్గా సాగింది. అక్కడి ఫోటోలు, వీడియోలతో పాకిస్తాన్కు క్లియర్ కట్ మెసేజ్ వెళ్లింది. పీఎం మోదీ సెల్యూట్ చేసే ఫోటో అన్నిటికంటే హైలైట్. ఆ ఒక్క ఫోటోతో రెండు స్ట్రాంగ్ మెసేజ్లు ఇచ్చారు. ఆ ఫోటోలో మోదీ వెనకాల.. 400 కనిపించింది. మోదీలానే ఠీవీగా నిలుచుని ఉంది మన సుదర్శన చక్రం. ఈ పిక్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పాకిస్తాన్ తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టింది ఆ ఫోటో.

**ఒక్క ఫోటోతో స్ట్రాంగ్ మెసేజ్** యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఫేక్ ప్రచారాన్నే నమ్ముకొని పరువు నిలుపుకుంటోంది పాకిస్తాన్. భారత్లోని అదంపూర్ ఎయిర్ బేస్పై డ్రోన్లతో దాడి చేసి నాశనం చేశామని ప్రకటించుకుంది. అదంపూర్లో 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ను ధ్వంసం చేశామని ప్రచారం చేసుకుంది. అదంతా ఫేక్ అని.. అదంపూర్ ఎయిర్ బేస్ సురక్షితంగా ఉందని పాకిస్తాన్తో పాటు యావత్ ప్రపంచానికి చాటిచెప్పేలా.. ప్రధాని మోదీ కావాలనే అదంపూర్ బేస్కు వెళ్లారు. తమ సైనిక స్థావరం సేఫ్ అండ్ పర్ఫెక్ట్ అని చాటి చెప్పారు. ఎస్ 400 బ్యాక్గ్రౌండ్లో నిలుచొని.. మన ఆర్మీ సత్తా ఘనంగా చాటారు. మరో ఫోటోలో మోదీ వెనకాల రఫేల్ ఫైటర్ జెట్ కూడా ఉంది. మన యుద్ధ విమానాలను పాకిస్తాన్ కూల్చేసిందనే ప్రచారానికి అలా చెక్ పెట్టారు.

**తలపై త్రిశూల టోపీ..** ప్రధాని పర్యటన సమయంలో ఆయన ధరించిన టోపీ సైతం పెద్ద మెసేజే ఇస్తోంది. సాధారణ ఆర్మీ క్యాప్ కాదది. ఆ టోపీపై త్రిశూలం సింబల్ ఉంది. అది మన త్రివిధ దళాలకు సంకేతం. మన త్రిశూల వ్యూహానికి నిదర్శనం. ఆపరేషన్ సిందూర్తో భరతమాత ఆది పరాశక్తిగా మారిన తరుణంలో అమ్మవారి చేతిలోని త్రిశూలానికి చిహ్నం. ఆర్మీ, నేవీ, ఎయిర్ఫోర్స్ సమిష్టిగా పాకిస్తాన్పై పోరాడి శిక్షించిన తీరుకు సాక్ష్యం. ప్రధాని మోదీ ధరించిన క్యాప్తో అంత పెద్ద మెసేజ్ ఉందని అంటున్నారు. మొత్తంగా పీఎం మోదీ అదంపూర్ ఎయిర్ బేస్ పర్యటనే ఓ స్ట్రాటజీక్ మూవ్ అని చెబుతున్నారు. దటీజ్ మోదీ. ఆయన ఏం చేసినా.. దానికో లెక్కుంటుంది.

**విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన** సీబీఎస్ఈ 10, 12 తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు చెప్పారు. ఇది విద్యార్థుల దృఢసంకల్పం, క్రమశిక్షణ, కఠోర శ్రమకు దక్కిన ఫలితమన్నారు. ఈ పరీక్షల్లో విజయానికి దోహదం చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, ఇతరుల పాత్రను గుర్తుంచుకొనే రోజు కూడా ఇదేనని పేర్కొన్నారు. సీబీఎస్ఈ పరీక్షల ఫలితాలు విడుదలైన అనంతరం ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

ముమ్ముందు వచ్చే అన్ని అవకాశాల్లో పరీక్షా వారియర్లు గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా. ఇప్పుడు సాధించిన స్కోర్ల పట్ల కొంచె నిరుత్సాహంగా ఉన్న వారికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఒక్క పరీక్ష మిమ్మల్ని ఎప్పటికీ నిర్వచించలేదు. మీ ప్రయాణం ఇంకా చాలా పెద్దది. మీ బలాలు మార్కుల పట్టికను మించిపోతాయి. ఎన్నో గొప్ప విషయాలు ఎదురు చూస్తున్నందున మీరు విశ్వాసంతో ముందుకు సాగండి. కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఉత్సుకతతో ఉండండి" అని సూచించారు.



## సీబీఎస్సీ పదో తరగతి ఫలితాలు వచ్చేశాయ్..



హైదరాబాద్, మే 13: దేశవ్యాప్తంగా 42 లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న సీబీఎస్సీ10, 12 తరగతుల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ రోజు ఉదయం తొలుత 12వ తరగతి ఫలితాలు విడుదల చేసిన బోర్డు.. 2 గంటల తర్వాత పదో తరగతి ఫలితాలు కూడా వెల్లడించింది. బోర్డు మంగళవారం ఈ రిజల్ట్స్ ప్రకటించింది. పరీక్షలకు హాజరైన విద్యార్థులు సీబీఎస్సీ అధికారిక వెబ్సైట్ ద్వారా తమ ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. విద్యార్థులు తమ రోల్ నంబర్, పుట్టిన తేదీ, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డు నంబర్లను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. విద్యార్థులు డిజీలాకర్, ఉమాంగ్ మొబైల్ యాప్ల ద్వారా కూడా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.ంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 2024–25 విద్యాసంవత్సరానికి 10వ తరగతి బోర్డు పరీక్షలకు దేశ వ్యాప్తంగా 2,371,939 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,221,636 మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే మొత్తం 93.66 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇది 2024 కంటే 0.06 శాతం ఎక్కువ అని సీబీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. 1.99 లక్షలకు పైగా అభ్యర్థులు 90 శాతానికి పైగా స్కోరు సాధించగా, 45 వేలకు పైగా అభ్యర్థులు 95 శాతానికి పైగా స్కోరు సాధించారు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 18 మధ్య ఈ పరీక్షలు జరిగాయి.సీబీఎస్సీ 10వ తరగతి ఫలితాల్లో త్రివేంద్రం 99.79 శాతం ఉత్తీర్ణతతో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేసింది. ఆ తర్వాత స్థానంలో విజయవాడ, బెంగళూరు, చెన్నై, పూణే ఉన్నాయి. %జదీూజు% విడుదల చేసిన ఫలితాల్లో గౌహతి 84.14 శాతం ఉత్తీర్ణతతో అట్టడుగున ఉంది.12వ తరగతితోపాటు, 10వ తరగతి బోర్డు పరీక్ష ఫలితాల్లో కూడా బాలికలు సత్తా చాటారు. పదో తరగతిలో బాలికల ఉత్తీర్ణత శాతం 95 శాతం కాగా, బాలుర విషయంలో ఇది 92.63 శాతం. విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీని తగ్గించే లక్ష్యంతో సీబీఎస్సీ మెరిట్ జాబితాను విడుదల చేయలేదు. జాతీయ స్థాయిలో టాపర్ల పేర్లను కూడా జారీ చేయలేదు.

## కోల్కతా ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు కాల్..



కోల్కతా : విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ రావడంతో కోల్కతాలోని నేతాజీ శుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నేడు హైఅలర్ట్ ప్రకటించారు. ముంబైకి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేయడంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులను విమానం నుంచి దింపేసి తనిఖీలు నిర్వహించాయి.ప్రయాణికులందరూ విమానంలో కూర్చున్న తరువాత ఈ కాల్ వచ్చిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటలకు విమానం టేకాఫ్ అవ్వాల్సి ఉందని వివరించారు. ఈలోపు బెదిరింపు కాల్ రావడంతో ఎమర్జెన్సీ ప్రొటోకాల్ ప్రకారం మొత్తం 195 మంది ప్రయాణికులను కిందకు దింపి విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్టు వివరించారు."లగేజీలను కిందకు దించాము. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఎయిర్పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు" అని అధికారులు పేర్కొన్నారు.ఆపరేషన్ సిందూర్ తరువాత ఎయిర్పోర్టులకు ఇలాంటి బెదిరింపు కాల్ రావడం ఇది రెండోసారి. అంతకుమునుపు మే 6న ముంబై ఎయిర్పోర్టుకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్ వచ్చింది. చండీగఢ్ నుంచి రానున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. ఆ తరువాత తనిఖీల సందర్భంగా అది నకిలీ కాల్ అని తేలింది.

## మా సైనికులు చనిపోయింది 11 మందే

### ఆపరేషన్ సింధూర అనంతర పరిణామాలపై పాక్



పెంఆవర్ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్లో తనకు జరిగిన నష్టాలను పాక్ మెల్లగా వెల్లడిస్తోంది. తాజాగా 11 మంది సైనికులు మరణించగా.. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియజేసింది. ఇక పాకిస్థాన్ వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది మృతి చెందారని.. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్ కూడా ఉన్నట్లు తెలిపింది. భారత్ చేపట్టిన ఆపరేషన్లో 40 మంది పౌరులు చనిపోగా.. 121 మంది గాయపడినట్లు పేర్కొంది. ఈమేరకు ఆ దేశ సైన్యానికి చెందిన డీజీ ఐఎస్పీఆర్ ఓ ప్రకటనలో వెల్లడించింది. నిన్న కూడా పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరీ.. తమ దేశ ఎయిర్ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. "భారత్తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది" అని వెల్లడించారు. అయితే, ఆ నష్టం ఏ స్థాయిలో ఉందనే విషయంపై పూర్తి వివరాలను ఆయన బయటపెట్టలేదు. మరోవైపు భారత వాయుసేనకు చెందిన ఎయిర్ మార్షల్ ఏకే భారతి ఇటీవల మీడియా బ్రీఫింగ్స్లో మాట్లాడుతూ తాము పాక్ యుద్ధ విమానాలను కూల్చేసినట్లు ధ్రువీకరించారు. అయితే.. ఆ శకలాలు పాకిస్థాన్లోనే పడిపోయినట్లు చెప్పారు. కూలిపోయిన విమానం పాక్కు చెందిన మిరాజ్ కావచ్చని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

## ఊపందుకున్న 'బాయ్ కాట్ తుర్కియే' నినాదం!

పెషంఆవర్ : పాకిస్థాన్లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్ కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు.

పాక్తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..** పుణెలో మార్కెట్లో తుర్కియే యాపిల్ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీం




తో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వర్తకులు మాత్రం.. దీన్ని ఆర్థిక నిర్ణయంగా మాత్రమే కాదని, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని పేర్కొంటున్నారు. యాపిల్లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు.

మరోవైపు, హిమాచల్ ప్రదేశ్కు చెందిన కాంగ్రెస్ నేత కుల్దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ ఆ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

**భారత్పై ద్వేషం..** ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే

## ఊపందుకున్న 'బాయ్ కాట్ తుర్కియే' నినాదం!

పెషంఆవర్ : పాకిస్థాన్లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్ కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు.

పాక్తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..** పుణెలో మార్కెట్లో తుర్కియే యాపిల్ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీం




తో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వర్తకులు మాత్రం.. దీన్ని ఆర్థిక నిర్ణయంగా మాత్రమే కాదని, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని పేర్కొంటున్నారు. యాపిల్లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు.

మరోవైపు, హిమాచల్ ప్రదేశ్కు చెందిన కాంగ్రెస్ నేత కుల్దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ ఆ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

**భారత్పై ద్వేషం..** ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే

## ఇండోనేషియాలో భారీ పేలుడు.. 13 మంది మృతి

### నలుగురు సైనికులు, తొమ్మిది మంది నివాసితులు మృతి

పశ్చిమ జావా : ఇండోనేషియాలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 13 మంది దుర్మరణం చెందారు. సైన్యానికి సంబంధించిన కాలం చెల్లిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేస్తుండగా ఒక్కసారిగా ఈ పేలుడు సంభవించింది. దీంతో 13 మంది ప్రాణాలు కోల్పోయార. ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రావిన్స్లోని గరుట్ రీజెన్సీలో మందుగుండు సామగ్రి నిర్వీర్యం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారని సైనిక అధికారి తెలిపారు. జకార్తా సమయం ప్రకారం ఉదయం 09:30 గంటలకు గరుట్ రీజెన్సీలోని సాగర గ్రామంలో ఈ ఘోరం జరిగింది. బాధితుల్లో నలుగురు సైనికులు, తొమ్మిది మంది నివాసితులు ఉన్నారని ఇండోనేషియా ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ వాహ్యు యుధాయన పేర్కొన్నారు. బాధితులందరినీ పమెంగ్ప్యాక్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తొలుత రెండు చోట్ల పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారని.. మూడో చోట చేస్తుండగా ఊహించని విధంగా ఈ దుర్ఘటన జరిగినట్లుగా వివరించారు. సైనిక బృందం గతంలో అనేక మార్లు తనిఖీ చేశారని.. సురక్షితమైన స్థితిలోనే ఉన్నాయని నిర్ధారించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు.

## అండమాన్ను తాకిన నైరుతి రుతుపవనాలు

న్యూఢిల్లీః వడగాలులు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. మంగళవారం మధ్యాహ్నం నైరుతి రుతుపవనాలు అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరుకున్నట్లు ఐఎండీ ప్రకటించింది.

అండమాన్ పరిసరాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల రాకతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**నైరుతి విస్తరణకు అనుకూల వాతావరణం** రానున్న మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులతో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం వరకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని ఐఎండీ వెల్లడించింది. మే 27 నాటికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ అంచనా వేస్తుంది.

**నైరుతి రుతుపవనాలతో అధిక వర్షాలు :** భారతదేశానికి నైరుతి రుతుపవనాల చాలా కీలకం. నైరుతి రుతుపవనాలతో దేశంతో అధికంగా వర్షాలు కురుస్తాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళను తాకుతుంటాయి. ఈ ఏడాది కాస్త ముందుగానే మే 27 నాటికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశాలు కనిపిస్తున్నాయి.



2009లో మే 23నే రుతుపవనాలు కేరళను తాకాయి. ఆ తర్వాత అంత త్వరగా ఏడాదే అంచనా వేస్తున్నారు. అనుకున్న సమయానికి రుతుపవనాలు కేరళను తాకితే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తుంది. ఈనెల 27న నైరుతి రుతుపవనాలు తాకనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ రుతుపవనాల విస్తరణ ప్రకారం చూస్తే జూన్ మొదటివారంలోనే అంటే దాదాపు ఐదో తేదీలోపే రాష్ట్ర సరిహద్దులను తాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

**ఏపీకి రుతుపవనాల రాక ఎప్పుడంటే? :** సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 నుంచి వారం రోజుల వ్యవధిలో కేరళను తాకుతుంటాయి. ఆ తర్వాత వారం, పది రోజుల్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాకు విస్తరిస్తాయి. రుతుపవనాలు కేరళను తాకినప్పటి నుం చి ఏపీలో వాతావరణం చల్లబడుతుంది. జూన్ మూడో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తాయి. ఈ ఏడాది మే 27 నాటికి రుతుపవనాలు కేరళను తాకే అవకాశాలు ఉండడంతో జూన్ రెండో వారం నుంచే ఏపీలో వర్షాలు పుంజుకునే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు.

**తెలంగాణకు రుతుపవనాలు రాక ఎప్పుడంటే?** ఈ నెల 27న నైరుతి రుతుపవనాలు తాకనున్నట్లు ఐఎండీ అంచనా వేస్తుంది. ఈ రుతుపవనాల విస్తరణ ప్రకారం చూస్తే జూన్ మొదటివారంలోనే అంటే దాదాపు ఐదో తేదీలోపే తెలంగాణ సరిహద్దులను తాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

రానున్న వర్షాకాలంలో సాధారణం కంటే అధికంగానే వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు గతేడాది 962.6 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఈ ఏడాది తెలంగాణలో సాధారణ సగటు కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తుంది.

## లుంగీతో పారిపోయిన మాజీ అధ్యక్షుడు..!

### హత్య కేసు ఆరోపణలు ఎదుర్కొంటోన్న అబ్దుల్ హమీద్

ఢాకా : బంగ్లాదేశ్ లో మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత ఆ పార్టీ నేతలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే హసీనా దేశం విడిచి భారత్లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. మిగతా నాయకులు తాత్కాలిక ప్రభుత్వంలో అనేక కేసుల్లో చిక్కుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ తాజాగా దేశం విడిచి పారిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఆయన థాయ్లాండ్ విమానం ఎక్కినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది.

అవామీ లీగ్ విద్యార్థి విభాగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన హమీద్ తొలుత ఎంపీగా ఎన్నికయ్యారు. 2013 నుంచి 2023 మధ్య హసీనా ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రెండు సార్లు అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అయితే, గతేడాది ఆగస్టులో విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారి హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం అవామీ లీగ్ హయాంలో ఆందోళనకారులపై దాడులు, హత్యల ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో మాజీ అధ్యక్షుడు హమీద్పై హత్య కేసు నమోదైంది.

అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న 81 ఏళ్ల హమీద్ గతవారం ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి థాయ్ ఎయిర్వేస్ విమానం ఎక్కినట్లు కథనాలు వచ్చాయి. ఆయన వెంట సోదరుడు, బావ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఎయిర్పోర్టులో ఆయన దృశ్యాలు బయటకు వచ్చాయి. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లుంగీలో ఉన్న హమీద్ విమానాశ్రయానికి వచ్చినట్లుగా అందులో ఉంది.

దీంతో యూనస్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు



చేసింది. ఇప్పటికే కొంతమంది పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని బదిలీ చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఆయన వైద్య చికిత్స నిమిత్తం థాయ్ వెళ్లినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అయితే, విచారణ నుంచి తప్పించుకునేందుకే దేశం విడిచి పారిపోయినట్లు రాజకీయ ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. అవామీ లీగ్ పార్టీని నిషేధిస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. అవామీ పార్టీ, దాని నాయకులపై ప్రత్యేక ట్రైబ్యునల్ విచారణ పూర్తయ్యేవరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది.

# చార్మినార్ వద్ద సుందరీమణులు హెరిటేజ్ వాక్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మిస్ వరల్డ్-2025 పోటీదారులు మంగళవారం హైదరాబాద్ నగరంలోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. నగర వారసత్వాన్ని, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చార్మినార్ పరిధిలో మిస్ వరల్డ్-2025 హెరిటేజ్ వాక్, చౌమల్లా ప్యాలెస్లో వెల్కమ్ డిన్నర్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మిస్ వరల్డ్-2025 పోటీదారులు మంగళవారం హైదరాబాద్ నగరంలోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత చార్మినార్ వద్ద హెరిటేజ్ వాకింగ్ నిర్వహిస్తారు. దాదావు నాలుగు ప్రత్యేక బస్సుల్లో చార్మినార్ వద్దకు చేరుకునే 109 దేశాల సుందరీమణులకు పాత బస్తీలో పాపులర్ అయిన మార్ఫా వాయిద్యాలతో స్వాగతం పలుకుతారు. చార్మినార్ వద్ద ప్రత్యేకంగా ఫోటో షూట్ నిర్వహిస్తారు. అనంతరం చార్మినార్ సమీపంలోని చుడీ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ చేస్తారు. అలాగే హైదరాబాద్ బ్యాంగిల్స్, ముజీబ్ బ్యాంగిల్స్, కన్హయ్యలాల్, మోతిలాల్ కర్వా, గోకుల్ దాస్ జరీవాల, కెఆర్ కాసత్, జాజు పెరల్స్ ఏహెచ్ జరీవాల, అఫ్జల్ మియా కర్చోబే వాలే దుకాణాల్లో షాపింగ్ చేస్తారు. గాజులు తయారు చేసే విధానాన్ని స్వయంగా పరిశీలిస్తారు. అనంతరం సుప్రసిద్ధ చౌమల్లా ప్యాలెస్లో ఏర్పాటు చేసే విందుకు హాజరవుతారు. కాగా మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లకు మెహంది వేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నిజామి సాంప్రదాయ దుస్తులను కూడా ధరించడానికి ఏర్పాట్లు చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలిపే సినిమాలను ప్రదర్శిస్తారు. చౌమల్లా ప్యాలెస్లో వెల్కమ్ డిన్నర్ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చార్మినార్ జోన్ పరిధిలోని ప్రాంతాల్లో ట్రాఫిక్ను మళ్లించనున్నారు. మిస్వరల్డ్ పోటీదారులు బుధవారం ఓరుగల్లు పర్యటనకు రానున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. తొలుత 35 మందితో కూడిన అందాల భామల బృందం వేయిస్తంభాల ఆలయ నిర్మాణం, శిల్ప వైభవాన్ని, వరంగల్ కోటలో కాకతీయుల కీర్తి తోరణంతో పాటు శిల్పసంపదను పరిశీలిస్తుంది. కాగా, 22 మంది అందగత్తెలతో కూడిన మరో బృందం హైదరాబాద్ నుంచి నేరుగా ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి చేరుకుని.. అక్కడి శిల్ప సౌందర్యాన్ని పరిశీలిస్తారు. పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తారు. రాత్ర హరిత కాటేజీల్లో డిన్నర్ పూర్తి చేసుకుని హైదరాబాద్కు తిరుగు ప్రయాణమవుతారు.

## తరతరాలుగా గూడులేని చెంచులకు

# 10 వేల ఇందిరమ్మ ఇండ్లు



● ఐటిడిఏ పరిధిలోని ఎస్టీ నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు ● గవర్నర్, సిఎం ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం ● రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తరతరాలుగా సొంత ఇండ్లకు నోచుకోని ఆదిమ గిరిజన తెగలలోకి అతి బలహీన వర్గమైన చెంచుల సొంతింటి కలను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేయబోతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐటిడిఎ)ల పరిధిలో సచ్యురేషన్ పద్ధతిలో దాదావు పదివేల చెంచు కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గారు పలు సందర్భాలలో సూచించడం జరిగిందని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని గవర్నర్ గారు, ముఖ్యమంత్రిగారి సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని. వీరు అడవుల్లో వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని . చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరు. అందుకే వీరు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉట్నూరు ఐటిడిఏ పరిధిలో ఆసిఫాబాద్ 3551, బోథ్ 695, ఖానాపూర్ 1802, సిర్పూర్ 311, అదిలాబాద్ 1430, బెల్లంపల్లి 326, భద్రాచలం ఐటిడిఏ పరిధిలో అశ్వరావుపేట 105, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్ లో అచ్చంపేట్ 518, మహబూబ్నగర్ 153, పరిగి 138, తాండూర్ 184 మొత్తం 9,395 ఇండ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, అయితే ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని అయితే ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు గాను 20 శాతం ఇండ్లను బఫర్ కింద పెట్టుకోవడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా జిహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాలలోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని , హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. గత ప్రభుత్వం కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి హైదరాబాద్లో ఉన్నపేదలకు కేటాయిస్తే వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టకొని పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలోనే జీ ప్లస్ త్రీ పద్ధతిలో అపార్ట్మెంట్లు నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలి

# వన్య ప్రానులను సంరక్షించాలి

### మంత్రి కొండా సురేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణ, వన్యప్రాణి సంరక్షణ చర్యలపై రాష్ట్ర అటవీ, పర్యారణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత ఉన్నతాధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జోన్ల సీసీఎఫ్ లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలతో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్వ్యాప్తంగా ఉన్న అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏం పరికరాలు వాడుతున్నారని అధికారులను ఆరా తీసిన మంత్రి సురేఖ ఒకేసారి పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని తెలుసుకున్న మంత్రి ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలున్నాయి... వాటి వల్ల వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని అడిగిన మంత్రి సురేఖ. కాగా, మంత్రికి వివరించిన వైల్డ్ లైఫ్ బోర్డు ఉన్నతాధికారులు వేసవి దృష్ట్యా అడవుల్లో, జూ లలో వన్యప్రాణుల, ఇతర జంతవులకు తగిన తాగునీటి సదుపాయాల కల్పన ఉందా అడిగిన మంత్రి. అయితే, ఈ వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు మంత్రికి వివరించిన అధికారులు నీటి గుంతల్లోకి నీటిని ప్రతిరోజూ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు తీసుకువస్తున్నట్టు వివరణ. నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్న మంత్రి సురేఖ. వన్యప్రాణులకు నీటి విషయంలో, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించద్దని అధికారులకు మంత్రి సురేఖ ఆదేశం ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటికి ఆహారం అందజేయాలని సూచన. కాగా, ఈ వీడియో కాన్ఫరెన్సు సమావేశంలో పీసీసీఎఫ్(హెఓఎఫ్ఎఫ్ డాక్టర్.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈలు సింగ్ మేరు, పీసీసీఎఫ్( స్కీమ్స్) జవహర్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల మధ్య రోడ్ల అనుసంధానం




సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి.....సంగారెడ్డి నియోజక వర్గంలో రహదారుల అభివృద్ధి పనులకు రూ.90 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభం చేశారు.పోతిరెడ్డిపల్లి (ఎన్ హెచ్ 65 ) రోడ్డు నుంచి భూలక్ష్మమ్మ, కలివేముల రోడ్డు,సదాశివపేట మండలం ఆత్మకూరు నుండి సింగూరు వరకు,కొండాపూర్ మండలంలోని మరే పల్లి నుచి సీత్రంకుంటకు గల వివిధ బీటీ రోడ్డు నిర్మాణాలకు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 15 గ్రామాల్లో రోడ్ల అనుసంధానంతో గ్రామస్థాయిలో సంపదను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.సంగారెడ్డి నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బలమైన రవాణా వ్యవస్థ అవసరం అని ఇందులో భాగంగా గ్రామాల మధ్య రోడ్లను అనుసంధానించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్కు చేరువ అవడం, చిన్న పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడటం, యువతకు ఉపాధి అవకాశాలు కలగడం వంటి పలు మార్గాల్లో సంపద సృష్టి జరుగుతుందనీ పేర్కొన్నారు.రహదారులు పూర్తయితే గ్రామాల మధ్య రవాణా వేగ వంతమవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ... గ్రామాల మధ్య సరైన రవాణా మౌలిక సదుపాయాలు ఉంటే గ్రామీణ ప్రజల జీవనోపాధిలో గణనీయమైన మార్పు వస్తుందనీ పేర్కొన్నారు.
టిజిఐఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గం ఆదర్శంగా తయారు చేస్తామన్నారు.ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని, త్వరితగతిన ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సి డి సి రాంరెడ్డి, ఆర్డిఓ రవీందర్ రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రోకు హార్వర్డ్ యూనివర్సిటీ గుర్తింపు

### ప్రపంచంలో అతిపెద్ద పీపీపీ ప్రాజెక్ట్గా బిజినెస్ రివ్యూ జర్నల్లో పబ్లిష్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో ఒకటైన హార్వర్డ్ యూనివర్సిటీ ఈ ప్రాజెక్టు కేస్ స్టడీగా ఎంచుకొని, తమ హార్వర్డ్ బిజినెస్ రివ్యూ అనే జర్నల్లో "హైదరాబాద్ మెట్రో - ఆలోచన నుంచి అమలువరకు: పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్లో ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్" అనే హెడ్డింగ్ తో రీసెర్చ్ పేపర్ ను పబ్లిష్ చేసింది. ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పటి నుంచి ల్యాండ్ అక్విజిషన్ ఇష్యూస్, మేటాస్ కంపెనీ ఫెయిల్ అవ్వడం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో రాజకీయ అస్థిరత, ప్రజల నిరసనలు, ఆర్థిక ఇబ్బందులు, వివిధ డిపార్ట్మెంట్ల నుంచి అప్రూవల్స్ తీసుకోవడంలో ఎదురైన ఆటంకాలు ఇలా అనేక సవాళ్లను ఈ రిపోర్టులో చర్చించారు. అయినప్పటికీ, మెట్రో వ్యూహాత్మక నాయకత్వం, స్ట్రాటజిక్ ప్లానింగ్, బోల్డ్ డెసిషన్స్తో 2017 నాటికి ఫస్ట్ ఫేజ్ ను సక్సెస్ఫుల్గా పూర్తిచేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రపంచంలోనే అతిపెద్ద పీపీపీ మెట్రో ప్రాజెక్టా నిలిచి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్లో ఆదర్శంగా నిలిచిందని హార్వర్డ్ రిపోర్ట్ పేర్కొంది. మెట్రో ఎండీ ఎన్వీఎస్ఎస్ రెడ్డి స్ట్రాటజిక్ విజన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి ఈ ప్రాజెక్టు అద్భుతంగా నడిపించారని తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గిందని, కాలుష్యం కంట్రోల్ అయ్యిందని, ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన ట్రాన్స్పోర్ట్ సౌకర్యం లభించిందని చెప్పింది. అలాగే, స్టేషన్ల చుట్టూ కమర్షియల్ డెవలప్మెంట్ జరిగి, ఆర్థిక వృద్ధి కూడా సాధ్యమైందని, ఇంతకు ముందు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్ బీ), స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలు కూడా హెచ్ఎమ్ఆర్ సక్సెస్ స్టోరీని తమ రివ్యూ రీసెర్చ్ పేపర్లుగా ప్రచురించాయి. తాజాగా, హార్వర్డ్ కూడా ఈ జాబితాలో చేరడంతో, హైదరాబాద్ మెట్రో రైల్ గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో రికార్డ్ క్రియేట్ చేసింది.

# తెలంగాణ ఆర్టీసి ఎండీ సజ్జనార్కు కీలక బాధ్యతలు?



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ ఆర్టీసి ఎండీ సజ్జనార్ కు కీలక బాధ్యతలు అప్పగించే ఆలోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తుంది. తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్, లేదా అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా నియమించే ఛాన్స్ కనిపిస్తుంది. కొద్ది రోజులుగా ప్రమోషన్ కోసం సైలెంట్ గా ఉంటున్న వీసీ సజ్జనార్ అయితే ఆయన తనకు మంచి పదవి వస్తుందన్నట్లు ఆశిస్తున్నారు. అధికారుల్లో పెద్ద యెత్తున రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేస్తున్నట్లు సమాచారం. తనకు అనుకూలంగా ఉండే వ్యక్తి, కఠిన నిర్ణయాలు తీసుకునే వారిని నియమించుకునే ఆలోచన? అందులో భాగంగా సజ్జనార్ కు కీలక బాధ్యతలు.?
మరి రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# పార్టీ మార్పుపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు స్పష్టం చేశారు. పార్టీ మారుతానని.. జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని సూచించారు. పార్టీ మార్పుపై వచ్చే ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతానని జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని ఆయన సూచించారు. కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకత్వ భాధ్యలు అప్పగిస్తే స్వాగతిస్తానని, క్రమశిక్షణ గల కార్యకర్తగా కేసీఆర్ ఆదేశాలను తూచా తప్పక పాటిస్తానని క్లారిటీ ఇచ్చారు.ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కార్పై హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకోవటానికి రైతులు కల్లాల్లో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ధాన్యం రాశులను వదిలేసి.. రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. అందాల పోటీల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉంటున్నారని.. పాకిస్తాన్ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదని సెటైర్లు వేశారు. రుణమాఫీ, రైతుబంధుపై సీఎం ఎందుకు రివ్యూ చేయటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రైతుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని, చనిపోయిన రైతులకు 25లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో నాలుగు రోజులు భారీవర్షాలు

## పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్...!!



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గత కొద్ది రోజులుగాఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రో ఎండలు రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం పది దాటిందంటే చాలు ఇండ్లనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రానున్న నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.సముద్రంలో అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం(మే13) నుంచి నాలుగు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం, బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరువులతో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలతో వర్షాలు కురిస్తాయని అంచనా వేసింది. మరికొన్ని జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రాగల మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులు గాలి వేగం గంటకు 40-50 కి.మీతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఉరుములు, మెరువులు,ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# సైబర్ నేరస్తుల కోసం స్పెషల్ ఆపరేషన్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ సహా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న 20 మందిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్బీ) అధికారులు అరెస్టు చేశారు. మే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రెండు బృందాలు రెక్కీ నిర్వహించి వారిని అరెస్టు చేసినట్టు సీఎస్బీ డీజీ ప్రకటించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సైబర్ నేరస్తుల కోసం టీజీసీఎస్బీ స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. 20 మంది సైబర్ నేరస్తులను అరెస్టు చేసింది. సైబర్ క్రిమినల్స్కు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్న ఏజెంట్లతో పాటు.. సహకరిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్ట్ చేసింది. మే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అరెస్ట్ అయిన వారిలో 14 మంది మ్యూల్ ఖాతాదారులు, ఆరుగురు ఏజెంట్లు పట్టుబడిన వారిలో ఉన్నారు. నిందితులపై తెలంగాణలో 60కి పైగా కేసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 515 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో 27 మ్యూల్ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా రూ. 44.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. తెలంగాణలోనే ఐదుగురు నిందితులు చెక్కుల ద్వారా రూ 22,64,500 విత్ డ్రా చేశారు. నిందితులలో ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, బ్యాంకు ఉద్యోగి ఉన్నారు. వ్యాపారం, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ట్రేడింగ్ పార్ట్ టైం ఉద్యోగాల పేరట మోసాలు జరుగుతున్నాయి. అరెస్ట్ అయిన నిందితుల వద్ద నుంచి 20 మొబైల్ ఫోన్లు, 28 సిమ్ కార్డులు, 4 ఏటీఎంలు, 5 చెక్కు బుక్కులు, రెండు పాన్ కార్డులు, రెండు రబ్బర్ స్టాంపులు, పలు కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## అగ్ర కులాలకే పెద్ద పీటా..

# బడుగుల అభివృద్ధి ఏది?

● తెలుగు రాష్ట్రాలలో బీసీ ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి
● బిసిలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించాలి ● జాతీయ బిసి సంక్షేమ సంగం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలుగు రాష్ట్రాలలో పైగా బీసీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తెలుగు రాష్ట్రల సీఎంలను డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్ లో ఏపీ ఓబిసి సంఘం అధ్యక్షులు అంగిరేకుల వర్రప్రసాద్ యాదవ్, 98 డీఎస్సీ మిగిలిపోయిన అభ్యర్థుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన నిరుద్యోగుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీలో రెండు ప్రభుత్వాలు అలసత్వాన్ని విన్నాడాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాలన్నిటిని భర్తీ చేసేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాల సీఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దీనికోసం ప్రభుత్వ శాఖల్లో శాఖల వారీగా ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాల సంఖ్య యొక్క సమగ్ర వివరాలను సీఎంలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1998 డీఎస్సీ మిగిలిపోయిన అభ్యర్థులు కు ఎంటిఎస్ పద్ధతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరిగే విధంగా 1482 మంది రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.తెలుగు రాష్ట్రలలో గ్రూప్-1 సర్వీస్ కింద గత 10 సంవత్సరాలుగా పోస్టుల భర్తీ చేయలేదు. అలాగే గ్రూప్-2 సర్వీస్ కింద 6 సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేదు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ లో పూర్తి స్థాయి డైరెక్ట్ రికట్మెంట్ కోట భర్తీ చేయకుండా నామమాత్రంగా భర్తీ చేశారు. అందుకే ఈ కింది అంశాలను పరిగణలోకి తీసుకొని డైరెక్ట్ రికట్మెంట్ కోటా లెక్కించాలి. గత 10 సంవత్సరాలుగా గ్రూప్-1 స్థాయి పోస్టులు, గ్రూప్-2 పోస్టులలో ఎంతమంది రిటైర్ అయ్యారు. ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారు. లెక్కించి భర్తీ చేయాలి. తెలుగు రాష్ట్రలలో గ్రూప్-4 సర్వీస్ అంటే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు గత 25 సం.రాలుగా జిల్లా ఆఫీసులు, క్రింది స్థాయి ఆఫీసుల పోస్టులు భర్తీ చేయడం లేదు. కేవలం సచివాలయం, డైరెక్టరేట్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారు. మిగతా జిల్లా - మండల స్థాయి జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేయడం లేదు. చాలా సంవత్సరాల తరువాత ఇటీవల జారీచేసిన గ్రూప్ సర్వీస్ పోస్టులలో జిల్లా పోస్టులు కలిపారు. మొత్తం పోస్టులు తక్కువగా యున్నవి. కావున అన్నీ జిల్లాలలో యున్న ఖాళీలు లెక్కించి భర్తీ చేయాలి. ఇవన్నీ అంశాలను సమగ్రంగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. ఈ నిరుద్యోగుల సమావేశంలో నీల వెంకటేష్, ఆంగిరేకుల వర్రప్రసాద్ యాదవ్, 98 డిఎస్సి సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్, సంజీవ్, భైరవకోనా శ్రీనివాస్, బాబయ్య రమేశ్, లలిత, చిన్ని కృష్ణ, రాజశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్గా డా. చంద్రశేఖర్



జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్గా డా. చంద్రశేఖర్ ఎన్నిక నియామకం జరిగినది. మంగళవారం జాతీయ బి.సి భవన్ నందు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య జాతీయ బి.సి కొ ఆర్డినేటర్ ర్యాగా ఋషి అరుణ్ కుమార్ హాజరు కాగా అనంతరం ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందచేయడం జరిగింది. జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్గా డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ కృష్ణన్న వుట్టుకతోనే నాయకుడు. కృష్ణన్నను ఏ పార్టీ నాయకుడు తయారు చేయలేరు అన్నారు.. ఏ పదవి లేకుండానే ప్రజా నాయకుడు (మాస్లీడర్)గా ఎదిగాబు. నాయకుడనే పదానికి కొత్త అర్థం సృష్టించారు. ప్రజల కోసం ప్రజల అభివృద్ధి కోసం పోరాడి కొత్త-కొత్త స్కీములు పెట్టించడం కోసం ఉద్యమాలు చేసి రికార్డు సృష్టించారన్నారు. చాలా ఉద్యమాలు నాయకుల చుట్టూ తిరుగుతాయి. రాజకీయ పార్టీల చుట్టూ తిరుగుతాయి. తమ తమ అభివృద్ధి కోసం స్వార్థంతో తిరుగుతారు. కానీ బిసి అగ్రనేత ఆర్ కృష్ణన్న ఉద్యమాలు, ప్రజల సమస్యల చుట్టూ, వాటి పరిష్కారాల కోసం, తద్వారా ప్రజల అభివృద్ధి కోసం తిరుగుతున్నాయి అన్నారు.విద్యార్థులు, నిరుద్యోగులు, పేద ప్రజలు, ఉద్యోగులు, ఎస్సీ/ఎస్టీ/బిసి ప్రజల సమస్యలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమాలు చేపట్టిన ఘనత కృష్ణన్నకే దక్కుతుంది. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పార్టీల కంటే కృష్ణన్ననే ముందుండి పోరాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బి.సి లిబరేషన్ టైగర్ ఫోర్స్ అధ్యక్షులు జి. రాజ్ గోపాల్ యాదవ్, జాతీయ బి.సి యువజన సంఘం ఉపాధ్యక్షులు కిశోర్ యాదవ్, నీల వెంకటేష్, కౌశిక్, వంశీ, బాలయ్య, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాసిపెట్టుకోండి.. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. హైడ్రా పేరుతో ఇళ్లను కూలగొట్టి మహాపాపం మూటగట్టుకుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముషీరాబాద్కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్రావు కేటీఆర్ను కలిసి ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, ప్రజాసమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఒకే లేన్.. మిగతావన్నీ క్లోజ్. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసి, బీఆర్ఎస్కు మద్దతు ఇచ్చేలా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజని కాంత్ గౌడ్, ముప్పిడి నర్సింగ్రావు, నాగేష్ పాల్గొన్నారు.

suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

# గందరగోళంలో స్టార్ హీరోల రిలీజులు

ఇదే ఏడాది పక్కాగా రిలీజ్ అవ్వాల్సిన స్టార్ హీరోల సినిమాలు చాలా ఉన్నాయి. కానీ వాటి రిలీజ్ లోనే క్లారిటీ లోపిస్తుంది. ఏ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో అర్ధం కాని పరిస్థితి ఏర్పడింది. భారీ అంచనా లున్న సినిమా రిలీజ్ లపై స్పష్టత లేకపోవడంతో టైర్ -2, టైర్ -3 హీరోల చిత్రాలు ఎప్పుడు రిలీజ్ చేసుకోవాలో వాళ్లకు అర్ధం కాని పరిస్థితి ఏర్పడింది. ఓసారి ఆ వివరా ల్లోకి వెళ్తే మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర జనవరిలో రిలీజ్ అనుకున్నారు. కానీ రిలీజ్ అవ్వలేదు. వాయిదాకి ఎన్నో కారణాలు తెరపైకి వచ్చాయి. చివరిగా తేలింది ఏంటంటే? సీజీ వర్క్ ఎక్కువగా ఉండటంతో అనుకున్న టైమ్ లో ఆ పనులు పూర్తికాక వాయిదా వేసారు. ఇప్పటికీ సీజీ జరుగుతూనే ఉంది. జనవరి తర్వాత మార్చి, ఏప్రిల్ రిలీ అవుతుందన్నారు. అదీ జరగలేదు. కొత్తగా జూన్, ఆగస్టు...అక్టోబర్ అంటూ ప్రచారం మొదలైంది. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న రాజాసాబ్ పరిస్థితి ఇంతే. అదిగో రిలీజ్...ఇదిగో రిలీజ్ అనే ప్రచారం తప్ప రిలీజ్ అవ్వ డం జరగలేదు. ఆ సినిమా ఏ స్టేజ్ లో ఉందో? ఎలాంటి అప్ డేట్ లేదు. అలాగే యంగ్ హీరో తేజ సజ్జా మిరాయ్ కూడా రిలీజ్ తేది రివీల్ చేయలేదు. సినిమాకి సంబంధించి అప్ డేట్ కూడా లేదు. ఇంకా అనుష్క ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న ఘాటీ రిలీజ్ పై స్పష్టత లేదు. చిత్రీకరణ పూర్త యిన యూనిట్ అంతా కామ్‌గా ఉంది. దీంతో బ్యాకెండ్ లో ఏం జరుగుతుందో తెలియలేదు. అలాగే మాస్ రాజా రవితేజ మాస్ జాతర మేకర్స్ కూడా సైలెంట్ గానే ఉన్నారు. రిలీజ్ విషయంలో క్లారిటీ ఇవ్వడం లేదు.



# 'మూడ్ ఆఫ్ తమ్ముడు'

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'తమ్ముడు'. ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అంటూ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేశారు. ఈ చిత్రంలోని ఇంపార్టెంట్ పాత్రలని, కారెక్టర్ నేమ్స్‌ను రివీల్ చేస్తూ వదిలిన 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అందరినీ ఆకట్టుకునేలా ఉంది. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' విషయానికి వస్తే ఇందులో సప్తమి గౌడ రత్న అనే పాత్రలో, స్వసిక గుత్తి అనే కారెక్టర్‌లో కనిపించబోతోన్నారు. ఇక సౌరభ్ సచ్ దేవ్ అగర్వాల్ పాత్రను పోషిస్తున్నారు. చిత్రగా వర్ష బొల్లమ్మ, ఝాన్సీ కిరణ్మయిగా లయ కనిపించబోతోన్నారు. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అంటూ ఒక్కొక్కరి పాత్ర ఎలా ఉంటుందో హింట్ ఇచ్చారు. కథను కూడా కాస్త రివీల్ చేసినట్టు అనిపిస్తోంది. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' చివర్లో నితిన్ ఎంట్రీ, బాణం వదిలిన తీరు అద్భుతంగా ఉంది. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' కోసం అజనీష్ లోకనాథ్ ఇచ్చిన ఆర్ఆర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. నెవ్వర్ బిఫోర్ అనే రేంజ్‌లో అజనీష్ తన బీజీఎంతో 'మూడ్ ఆఫ్ తమ్ముడు' ఆకాశమంత ఎత్తులో నిలబెట్టేశాడు. కేవీ గుహన్ విజువల్స్, కెమెరా వర్క్ కూడా ఎలా ఉండబోతోందో ఈ 'మూడ్ ఆఫ్ తమ్ముడు' చూపించేస్తోంది. మొత్తానికి శ్రీరామ్ వేణు మాత్రం ఈ సారి తెరపై మ్యాజిక్ చేయబోతోన్నాడని ఈ 'మూడ్ ఆఫ్ తమ్ముడు' చెప్పకనే చెబుతోంది.



# 'కన్‌ఖజురా'

## టీజర్.. మే 30 నుంచి స్ట్రీమింగ్

సస్పెన్స్, థ్రిల్లర్ 'కన్‌ఖజురా' టీజర్‌ను శుక్రవారం మే 2 నాడు రిలీజ్ చేశారు. గోవాలో, అక్కడి ప్రాంతాల్లో జరిగే నేరాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నిశ్శబ్దం మోసపూరితంగా ఉంటుంది.. అది బయటకు కనిపించే దాని కంటే చాలా ప్రమాదకరంగా ఉంటుంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ఇజ్రాయెల్ సిరీస్ 'మాగ్ఫీ'ని హిందీ ప్రేక్షకుల కోసం అనువదిస్తున్నారు. అయితే 'కన్‌ఖజురా'ని ఇండియన్ ఆడియెన్స్ కోసం పూర్తిగా మార్పులు చేర్పులు చేసి తెరకెక్కిస్తున్నారు. ఇద్దర విడిపోయిన అన్నదమ్ముల మధ్య జరిగే పోరు.. తమ చీకటి గతాన్ని ఎదుర్కోవలసి రావ డం.. జ్ఞాపకశక్తి, వాస్తవికత మధ్యలో వారిద్దరూ నలిగిపోవడం వంటి ఆసక్తికరమైన అంశాలతో ఈ సిరీస్ ఉంటుంది. 'కన్‌ఖజురా' పాత్రను పోషించిన రోషన్ మాథ్యూ మాట్లాడుతూ.. "కన్‌ఖజురా'లో ఎంతో ఎమోషన్ ఉంటుంది. ఈ కథలోని భావోద్వేగ తీవ్రత, గందరగోళం కింద ఉన్న నిశ్శబ్దం వంటి అంశాలనే ఇందులో నన్ను నటించేలా చేశాయి. అషు అనే పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. క్షణానికో రకంగా మారుతుంటుంది. కానీ లోపల నిశ్శబ్ద తుఫాను ఉంటుంది. ఈ కథ అందరి హృదయాల్ని కదిలించడం కాకుండా వెంటాడుతుంది' అని అన్నారు. అజయ్ రాయ్ నిర్మాతగా.. చందన్ అరోరా దర్శకత్వం వహించిన 'కన్‌ఖజురా'లో మోహిత్ రైనా, రోషన్ మాథ్యూ, సారా జేన్ దయాస్, మహేష్ శెట్టి, నినాద్ కామత్, త్రినేత్ర హల్దార్, హీబా షా మరియు ఉషా నద్కర్ణి వంటి వారు నటించారు. ప్రశంసలు పొందిన ఇజ్రాయెల్ సిరీస్ మాగ్ఫీ ఆధారంగా ఈ షోను యెస్ స్టూడియోస్ లైసెన్స్‌తో సృష్టికర్తలు ఆడమ్ బిజాన్స్కీ, ఓమ్రీ షెన్హార్, డానా ఈడెన్‌లు డోనా, షులా ప్రొడక్షన్స్ నిర్మించారు.



# సుధీర్ బాబు యాక్షన్ డ్రామా అనౌన్స్‌మెంట్



కంటెంట్ బేస్డ్ సినిమాలు, భారీ స్థాయిలో మాస్ ఎంటర్‌టైనర్లు రూపొందించడంలో ప్రత్యేకత కలిగిన క్రేజీ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నవదళపతి సుధీర్ బాబు హీరోగా తమ 51వ ప్రొడక్షన్‌ను అనౌన్స్ చేసింది. ఈ చిత్రానికి ఆర్.ఎస్. నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. #పిఎమ్ఎఫ్ ఎస్.బి చిత్రాన్ని విజినరీ నిర్మాతలు టి..జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడంలో మంచి పేరు తెచ్చుకున్న సుధీర్ బాబు, ప్రతిసారి కొత్తదనం కోసం వినూత్నమైన కథలను ఎంచుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు అదే ధోరణిలో ఈ కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమా అధికారికంగా సుధీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేశారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఇందులో సుధీర్ బాబు షర్ట్ లెస్ గా, సాలిడ్ ఫిజిక్ తో ఇంటెన్స్ లుక్ లో కనిపించారు. మెట్లపై మృతదేహాలు పడిపోతుండగా, ఆయన ఒక చేతిలో ఆయుధాన్ని పట్టుకుని పైకెత్తుతూ కనిపించడం చాలా క్యూరియాసిటీని పెంచింది. ఈ పాత్ర కోసం మరోసారి సుధీర్ బాబు తన ఫిజిక్ ని మేకోవర్ చేస్తూ, కండలు తిరిగిన మాచో లుక్‌లో మారిపోయారు. బలమైన యాక్షన్ పాత్ర కోసం ఆయన బీస్ట్ మోడ్‌లోకి వెళ్ళారు.

# మే15 నుంచి స్ట్రీమింగ్ కానున్న 'మరణ మాస్'

డార్క్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన చిత్రం 'మరణ మాస్' సినిమా థియేటర్స్‌లో ఆడియెన్స్‌ను అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ప్రేక్షకులను ఓటీటీలో మెప్పించటానికి సిద్ధమైంది. మే15 నుంచి ఈ చిత్రం సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. బాసిల్ జోసెఫ్, రాజేష్ మాధవన్ ప్రధాన పాత్రల్లో నటించిన



ఈ చిత్రానికి శివ ప్రసాద్ దర్శకత్వం వహించారు. వ్యంగ్యం, సస్పెన్స్, అసంబద్ధత వంటి అంశాల కలయికతోఅద్భుతమైన రోలర్‌కోస్టర్ సినిమా తెరకెక్కింది. వాస్తవం అస్పష్టంగా మారినప్పుడు, ఒకే ఒక ప్రశ్న మిగులుతుంది: ప్రతిదీ నిజమేనా, లేక ఎవరో విషయాన్ని పెద్దదిగా చేయాలని చూస్తున్నారా? అని. 'మరణ మాస్' సినిమా కథ విషయానికి వస్తే ఒక హత్యను చూసినట్లు భావించే ఇద్దరు స్నేహితుల చుట్టూ కేరళలోని నేపథ్యంలో సాగుతుందీ చిత్రం. ఆ తర్వాత స్థానిక రాజకీయాలు, దాగిన ఎజెండాలు, ఎవరూ ఊహించకుండా జరిగే సంఘటనలు అనూహ్యంగా వెలుగులోకి వస్తాయి. ఈ సందర్భంగా బాసిల్ జోసెఫ్ మాట్లాడుతూ "మరణ మాస్ సినిమా నా హృదయానికి ఎంతో దగ్గరైన సినిమా. వైవిధ్యమైన హాస్యం, పాత్రలు, అనూహ్యమైన ట్విస్ట్‌లు దీన్ని ఒక అద్భుతమైన అనుభవంగా మారుస్తాయి. ఇది వరకు సోనీ లివ్‌లో నేను నటించిన ప్రవీణ్‌కూడు షప్పు సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. తర్వాత ఇప్పుడు ఇదే ఓటీటీలో మరోసారి మరో వైవిధ్యమైన సినిమాతో ముందుకు రావటం అనేది ఎంతో ఆనందంగా ఉంది అన్నారు.

# జో శర్మ థ్రిల్లర్ మూవీ 'M4M'

టాలీవుడ్ నిర్మాత మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'M4M' ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అరుదైన అవకాశం దక్కించుకుంది. ఈ చిత్రం మే 17న సాయంత్రం 6:00 గంటలకు కేన్స్‌లోని "PALAIS - C" థియేటర్‌లో ప్రైవేట్ స్క్రీనింగ్ జరగనుంది. గొప్ప అభిరుచిగల నిర్మాతగా గుర్తింపు పొందిన మోహన్ వడ్లపట్ల, ఈ చిత్రంతో దర్శకుడిగా మారారు. ప్రముఖ అమెరికన్ నటి జో శర్మ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించారు.



విడుదలకు ముందే ఈ సినిమా అనేక అంతర్జాతీయ ప్రశంసలు, అవార్డులు సొంతం చేసుకుంటోంది. ఇటీవలి కాలంలో జో శర్మ 'Waves 2025' ఈవెంట్‌లో అమెరికన్ డెలిగేట్/నటిగా పాల్గొని, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులతో పాటు అత్యంత గౌరవాన్ని అందుకు న్నారు. ఈ సందర్భంగా M4M టీమ్ ముంబయిలోని ప్రివ్యూ థియేటర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ, "మా సినిమాను కేన్స్‌లో ప్రదర్శించడమన్నది ఒక గొప్ప అవకాశం, ఈ సంతోషాన్ని మాటల్లో చెప్పలేం. మా టీమ్ అంతా చాలా ఉత్సాహంగా, ఆహ్లాదంగా ఉంది. త్వరలోనే ఈ సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నాం" అని తెలిపారు.

# రామ్ పోతినేని చిత్రంలో ఉపేంద్ర



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ అవైటెడ్ మూవీ #RAPO22తో అదరగొట్టబోతున్నారు. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో సక్సెస్ అందుకున్న మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, అన్ని వర్గాల ప్రేక్షకులను కట్టిపడేసేలా హార్ట్ టచ్చింగ్ ఎంటర్‌టైనర్ లా వుండబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఈ కథలో కొత్త కోణాన్ని తెస్తూ కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర "సూర్య కుమార్" పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పాత్ర ప్రతి ఒక్కరు అభిమానించే సూపర్ స్టార్‌ల ప్రతినిధిగా నిలుస్తుంది. ఇవాళ విడుదలైన పోస్టర్‌లో ఆయన పాపరాజీ లైట్ల మధ్య స్టైలిష్‌గా కనిపించి, తన స్క్రీన్ ఇమేజ్ తో అదరగొట్టారు. ఈ నెల 15న సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల కానుంది. ఈ చిత్రంలో కంప్లీట్ డిఫరెంట్ గెటప్‌లో రామ్ పోతినేని కనిపించనున్నారు. ఇప్పటి వరకు చేసిన హై వోల్టేజ్ యాక్షన్ చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాతో ఆయన ఓ కొత్త అవతార్ ని ప్రజెంట్ చేస్తోంది. దర్శకుడు మహేష్ బాబు పి ఈ కథను అద్భుతంగా మలిచారు. పాన్-ఇండియా స్థాయిలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది.

# ల్యాండ్ మార్క్ ప్రాజెక్టు చిత్రపురి కాలనీ

## -వల్లభనేని అనిల్ కుమార్

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన చిత్రపురి కాలనీ నూతన ప్రాజెక్ట్, భవిష్యత్ కార్యాచరణ గురించి సోమవారం జరిగిన కార్యక్రమం లో సభ్యులు వెల్లడించారు. త్వరలోనే భూమి పూజ ఉంటుందని అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ వెల్లడించారు. నూతన ప్రాజెక్ట్ '%హూ్ర్రూ౧×=జు ూఖ×ుజు%' కు సంబందించిన బ్రోచర్ ను విడుదల చేసారు. వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ "1994లో మొదటిసారి చిత్రపురి కాలనీ అనే ప్రాజెక్టు మొదలైంది. ప్రభుత్వాలు మారుతున్నాయి, అసోసియేషన్ అధ్యక్షులు మారుతున్నారు. అనుమతుల కోసం ప్రయత్నం



చేయడంలో ఎక్కడా వెనకడుగు వేయలేదు. అయితే ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్ కలగచేసుకున్న తర్వాతే పర్మిషన్ వచ్చిందని చెప్పడానికి గర్విస్తున్నాము. అయితే ఇప్పుడు రూ.166 కోట్లు అప్పులో ఉన్నాం. ఇక్కడ చాలా సమస్యలున్నాయి. వాటిని బయటకు చెప్పుకోలేం. కానీ ఎవరికీ ఇబ్బంది కలగకుండా పరిశ్రమలో కార్మికులు అందరికీ ఇళ్లు అందించాలనే ప్రయత్నంలో ఉన్నాం. ఆ తరుణంలో హైడ్రా వల్ల బఫర్ జోన్‌లో నాలుగున్నర ఎకరాల ల్యాండ్ కాస్త రెండు ఎకరాలు అయింది. అందులోనే ఇళ్లు నిర్మించి అందరికీ సర్దుబాటు చేయాలి. 166 కోట్లు అప్పు తీర్చాలి. ఇంకా 50 కోట్ల వర్క్ పూర్తి చేయాల్సి ఉంది. ఉన్న స్థలం ఎలా ప్లాన్ చేస్తే అందరికీ సర్దుబాటు చేయగలం, అప్పులు తీర్చగలం, పెండింగ్ వర్క్‌లు ఎలా పూర్తి చేయగలం అని అందరం కూర్చుని మాట్లాడుకుని ముందుకు వెళ్తున్నాం. ఇప్పుడు కట్టబోయే ప్రాజెక్ట్‌కు షఫైర్ సూట్ పేరుతో మొదలుపెట్టాం. పెండింగ్‌లో ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత. కొత్తగా అప్లై చేసుకునేవారికి సంబంధిత అసోసియేషన్ నుంచి ధృవీకరణ పత్రాలు తీసుకొస్తే వాటిని పరిశీలించి మెంబర్‌షిప్ ఇవ్వడం జరుగుతుంది. 2013లో జరిగిన ఇబ్బందులకు కూడా మమ్మల్నే బాధ్యుల్ని చేస్తున్నారు. ఇకపై ఆ సమస్యలు లేకుండా ట్రాన్స్‌ఫరెన్స్‌గా పని చేస్తున్నాం. గతంలో ప్రాజెక్ట్ 14 ఏళ్లు పట్టింది. ఇప్పుడు ప్రాజెక్ట్ మాత్రం భూమి పూజ చేసినప్పటి నుంచి 40 నెలల్లో అన్ని ఎమినిటీస్‌తో పూర్తి చేసి ఇస్తాం. ఇదొక ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్ అవుతుంది. ఇకపై చిత్రపురిపై ఎలాంటి అపోహలు ఉండవు" అని అన్నారు.

# జూలై 4న '3 BHK'



సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేష్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు- తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వ వచ్చింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ జూలై 4న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటీఫుల్ ఫ్యామిలీగా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ బ్యూటీఫుల్‌గా వుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈసినిమా రూపొందు తోంది. ఈ చిత్రానికి అమృత్ రామ్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్ డీవోపీగా పని చేస్తున్నారు. గణేష్ శివ ఎడిటర్. రాకేందు మౌళి డైలాగ్ రైటర్.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044